www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

సంపుటి : 17 | సంచిక : 220 | ఆదివారం 11.10.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

విలేకరులు కావలెను

18సం॥ లుగా వెలుపడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల, మండలాల వారీగా విలేకరులు కావలెను..

★ ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించవలసిన నంబర్ ★

సెల్ నెంబర్: 9951494039



# విమానంలోనే అరెస్టు

## అజ్ఞాత ప్రాంతానికి సీజేపీ నేతల తరలింపు

## జంతర్ మంతర్‌కు దారులన్నీ మూసివేత..

సీజేపీ నేతల తరలింపు.. గోప్యంగా ఉంచిన పోలీసులు

నిరసనకు ముందే అరెస్టులు.. ఢిల్లీలో రాజకీయ వేడి

సీజేపీ నేతల అరెస్టుపై ప్రతిపక్షాల ఆగ్రహం

- విమానం దిగగానే సీజేపీ నేతల అరెస్ట్
- జంతర్ మంతర్‌కు వెళ్లకముందే పోలీసుల అదుపులో నేతలు
- సీఈసీ రాజీనామా డిమాండ్‌తో ఢిల్లీలో ఉద్రిక్తత
- అభిజీత్ దీప్కే అరెస్ట్.. అజింక్యా షిండేకు ఉద్యమ బాధ్యతలు
- సీజేపీ నిరసనకు బ్రేకులు.. ఢిల్లీ అంతటా పోలీసుల పహారా
- ఢిల్లీలో నిరసనల కట్టడి.. ఎక్కడికక్కడ కార్యకర్తల అదుపు
- విద్యార్థులు, యువత కవాతు.. అడ్డుకున్న భద్రతా బలగాలు
- సీఈసీకి వ్యతిరేకంగా ఆందోళన.. పోలీసుల ముందస్తు చర్యలు
- సీజేపీ నేతల అరెస్టుపై ప్రతిపక్షాల ఆగ్రహం
- నిరసన హక్కుపై చర్చ.. ఢిల్లీలో ఉద్రిక్త పరిస్థితులు

02

ఆందోళనకారులపై పోలీసులు చర్యల నేపథ్యంలో సీజేపీ ఫౌండర్ దీప్కే హాట్ కామెంట్స్ చేశారు. నా ప్రాణం తీసినా.. ఉద్యమం ఆగదన్నారు. బెదిరింపులకు భయపడేది లేదని ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



ఢిల్లీలో నిరసనల కట్టడి.. ఎక్కడికక్కడ కార్యకర్తల అదుపు

"అరెస్టులకు భయపడం".. ఉద్యమం కొనసాగిస్తామన్న సీజేపీ నేతలు







## అరెస్టుకు ముందే వీడియో..

ఉద్యమానికి కొత్త నాయకుడిని ప్రకటించిన అభిజీత్ దీప్కే!

# మొన్న ఫారం-6.. ఇప్పుడు ఫారం-7..

## ఫారం-7పై పరిమితి.. ఒక్కరికి పది దరఖాస్తులే

- ఒక్కొక్కరికి పది ఫారాలే.. ఈసీ కీలక నిర్ణయం
- ఓట్ల తొలగింపు దరఖాస్తులపై ఈసీ కొత్త నిబంధనలు
- ఫారం-7 దుర్వినియోగానికి అడ్డుకట్ట.. ఎన్నికల సంఘం చర్యలు
- ఓటర్ల జాబితాపై వివాదం.. ఫారం-7పై ఈసీ కొరడా
- బల్క్ దరఖాస్తులకు బ్రేక్.. ఓటర్ల జాబితాపై కొత్త ఆంక్షలు
- ఫారం-7పై పరిమితి.. ఒక్కరికి పది దరఖాస్తులే

03





# రైతు కుటుంబాలకు గుడ్ న్యూస్..

## నవంబరు 19న రూ.5 లక్షల బీమా పథకం

సర్వోత్తమ్ రెడ్డి గెలుపే లక్ష్యం.. కాంగ్రెస్ శ్రేణులకు భట్టి పిలుపు

రైతు రుణమాఫీతో అప్పుల భారం తగ్గించే ప్రయత్నం

- పట్టభద్రుల ఓటరు నమోదుపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించాలి
- సర్వోత్తమ్ రెడ్డి విజయానికి సమష్టిగా పనిచేయాలి
- నిరుద్యోగులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం
- గ్రామస్థాయి నుంచి ఓటరు నమోదు వేగవంతం చేయాలి

02

# అన్యాయాలను సరిదిద్దుదాం

ప్రజల గొంతుకను కాపాడుతాం..



- ఓటు హక్కు పరిరక్షణకు వెనక్కి తగ్గేది లేదు
- బీజేపీ పాలనలో తప్పులను సరిదిద్దుతాం: సీఎం
- ప్రజాస్వామ్య పరిరక్షణకు యువత పోరాటం కొనసాగాలి
- రాహుల్ పిలుపునకు రేవంత్ మద్దతు.. పోరాటం ఆగదు
- యువత నిరసనలకు అండగా ఉంటాం
- గత పదేళ్ల పరిణామాలు పునరావృతం కానివ్వం

03



# ఆర్ఆర్-2 టెండర్లలో భారీ స్కామ్..

## టెండర్ల రికార్డులు బహిర్గతం చేయాలి

- రేడియల్ రోడ్-2 టెండర్లపై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు
- రూ.3,296 కోట్ల టెండర్లపై కేటీఆర్ బహిరంగ లేఖ
- ఆర్ఆర్-2 టెండర్లు రద్దు చేయాలి: కేటీఆర్
- రూ.600 కోట్ల నష్టం జరిగిందంటూ కేటీఆర్ ఆరోపణ
- టెండర్లలో అక్రమాలు జరిగాయంటూ రేవంత్‌కు కేటీఆర్ లేఖ
- తక్కువ ధర బిడ్డర్ల తొలగింపుపై కేటీఆర్ ప్రశ్నలు
- ఆర్ఆర్-2 టెండర్లపై శ్వేతపత్రం విడుదల చేయాలి

03

రూ.3,296 కోట్ల విలువైన రేడియల్ రోడ్-2 టెండర్లలో భారీ కుంభకోణం జరిగిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. బుద్వేల్ నుంచి కొడంగల్ వరకు కొత్తగా చేపట్టనున్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణ పనుల్ని ప్యాకేజీలుగా, ముక్కలుగా విభజించి ముందస్తుగా నిర్ణయించుకున్న నచ్చిన వారికే టెండర్లు కట్టబెట్టారని మండిపడ్డారు. తక్కువ ధరకు బిడ్లు వేసిన అర్హులైన సంస్థలను పక్కన పెట్టి, సాంకేతిక కారణాల పేరుతో ఇతరులను తొలగించి, ఎక్కువ ధరకు కోట్ చేసిన కంపెనీలకు పనులు కేటాయించడం ద్వారా వందల కోట్ల ప్రజాధనం వృథా అవుతోందని విమర్శించారు.



# రైతు కష్టంపై ఎమ్మార్వో వెటకారం

'నువ్వు ఇంకా బతికే ఉన్నావా?.. పురుగులమందు తాగలేదా?'

రైతును కించపరిచారంటూ తహసీల్దార్‌పై ఆరోపణలు

02

- న్యాయం కోసం వెళ్తే అవమానమేనా.. రైతు ఆవేదన
- రైతు కష్టంపై అధికారి వ్యాఖ్యలు.. విచారణకు డిమాండ్
- భూసమస్య పరిష్కారానికి వెళ్లిన రైతుకు చేదు అనుభవం
- రైతు ఆవేదనపై వైరల్ వీడియో.. అధికారిపై విమర్శలు
- అన్నదాతతో అమానవీయ వ్యాఖ్యలా?.. గజ్వేల్‌లో వివాదం

# పెరిగిన భూముల రిజిస్ట్రేషన్లు

## రిజిస్ట్రేషన్ల ఆదాయంలో 21.75 శాతం వృద్ధి



- రిజిస్ట్రేషన్ల ఆదాయం పెరిగింది.. బీఆర్ఎస్‌పై పొంగులేటి విమర్శలు
- భూములపై బీఆర్ఎస్ ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదు
- భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం
- బీఆర్ఎస్ ఆరోపణలను గణాంకాలతో తిప్పికొట్టిన పొంగులేటి
- ఆస్తుల రిజిస్ట్రేషన్ల పెరుగుదలే నిదర్శనం



# గెలిస్తే పొగడడం.. ఓడితే తిట్టడమా?

సీఈసీపై నిరాధార ఆరోపణలు తగవు: వెంకయ్య నాయుడు

ప్రజాస్వామ్య వ్యవస్థను మనమే కించపరచొద్దు

- ఎన్నికల సంఘాన్ని రాజకీయాల్లోకి లాగొద్దు
- గెలిస్తే ఘనత.. ఓడితే ఈవీఎంలపై నిందలా?
- సీఈసీపై నిరాధార ఆరోపణలు తగవు
- ఓట్ల తొలగింపుపై ప్రతిపక్షాల ఆరోపణలను తోసిపుచ్చిన వెంకయ్య
- రాజ్యాంగ సంస్థల గౌరవాన్ని కాపాడాలి
- భారత ఎన్నికల వ్యవస్థపై నమ్మకం ఉంచాలి

03

# విమానంలోనే అరెస్టు

**ఢిల్లీ :** సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఢిల్లీలో ఆందోళనకు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో సీజేపీ చీఫ్ అభిజీత్ దీప్కేను పోలీసులు అరెస్టు చేశారు. ఆందోళనలో పాల్గొనేందు ఇవాళ ముంబయి నుంచి ఢిల్లీ చేరుకున్న సీజేపీ ప్రధాన నేతలు అభిజీత్ దీప్కే, సౌరవ్ దాస్ అశితోశ్ రంకాను పోలీసులు అరెస్టు చేశారు. వీరు ప్రయాణి-స్తున్న విమానం ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులో ల్యాండ్ కాగానే పోలీసులు నేరుగా విమానంలోకి ప్రవేశించి ఈ ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మరో వైపు జంతర్ మంతర్ వద్దకు వచ్చిన సీజేపీ కార్యకర్తలను పెద్ద ఎత్తున పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు దాదాపు 500 మందికిపై గా నిరసనకారులను అదులులోకి తీసుకున్నారు. మరోవైపు నిరసనకారులెవరూ జంతర్ మంతర్ వద్దకు రాకుండా పోలీసులు నిలువరిస్తున్నారు. దీంతో నిరసనకాలు, పోలీసులతో ఢిల్లీ లో హైటెన్షన్ వాతావరణం నెలకొంది.

**ప్రాణం తీసినా ఉద్యం ఆగదు:**

ఆందోళనకారులపై పోలీసులు చర్యల నేపథ్యంలో సీజేపీ ఫౌండర్ దీప్కే హాట్ కామెంట్స్ చేశారు. నా ప్రాణం తీసినా.. ఉద్యమం ఆగదన్నారు. బెదిరింపులకు భయపడేది లేదని ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. మోడీ ప్రభుత్వం యువత నిరసనలకు భయపడుతోందా? అని నిలదీశారు. నిరసనల నేపథ్యంలో రైళ్లు, మెట్రో సేవల నిలిపివేతపై ఎక్స్ వేదికగా ప్రశ్నలు సంధించారు. ఢిల్లీలో భారీగా భద్రతా బలగాల మోహరింపుపై విమర్శలు గుప్పించారు. నిరసనల్లో పాల్గొనకుండా ప్రజలను అడ్డుకుంటున్నారంటూ ఆరోపించిన దీప్కే శాంతియుత నిరసన రాజ్యాంగం కల్పించిన హక్కు అని అరెస్టులకు భయపడను.. పోరాటం కొనసాగిస్తానన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జంతర్ మంతర్ వద్ద సీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన ధర్నాను పోలీసులు అడ్డుకోవడంతో పాటు దేశవ్యాప్తంగా ఎక్కడికక్కడ సీజేపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు. ముంబై నుంచి ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న సీజేపీ నేతలను పోలీసులు ఎయిర్‌పోర్ట్‌లోనే అదుపులోకి తీసుకున్నారు. సీజేపీ ముఖ్య నాయకులు అభిజీత్ దీప్కే అశుతోష్, సౌరవ్ దాస్‌లను విమానాశ్రయం వెనుక గేట్ నుంచి పోలీసులు రహస్యంగా అజ్ఞాత ప్రాంతానికి తరలించారు. వీరిని ఎక్కడికి తీసుకెళ్తున్నారనే సమాచారాన్ని పోలీసులు అత్యంత గోప్యంగా ఉంచడం గమనార్హం.

**అడ్డుకున్న వామపక్ష నేతలు..**

సీజేపీ నేతల అరెస్ట్‌లను అడ్డుకోవడానికి ప్రయత్నించిన వామపక్ష నాయకులను, సీజేపీ కార్యకర్తలను పోలీసులు చెదరగొట్టారు. నేతలతో పాటు సీజేపీ లీగల్ టీమ్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మ-రోవైపు, సీజేపీ చేపట్టిన ఆందోళనలకు మద్దతుగా సుప్రీంకోర్టు న్యాయవాదులు చేపట్టిన భారీ ర్యాలీని సైతం పోలీసులు అడ్డుకున్నారు. ఢిల్లీ వ్యాప్తంగా ప్రధాన ప్రాంతాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించడంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది.

# వారు నేరస్తులు కాదు..

**ఢిల్లీ :** చట్టపరమైన చిక్కుల్లో పడిన పిల్లల పాత రికార్డులను నిర్ణీత సమయంలోగా పూర్తిగా తొలగించాలని, వారి పేర్లు వార్తల్లో, ఇంటర్నెట్‌లో శాశ్వతంగా ఉండిపోకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. నేర ఆరోపణలు ఎదుర్కొంటున్న పిల్లలను వ్యవస్థ ఒక నేరస్తుడిగా కాకుండా, కేవలం పిల్లలుగా మాత్రమే చూడాలని స్పష్టం చేశారు. 'జువైనల్ జస్టిస్ (చిల్డ్రన్ కేర్ అండ్ ప్రొటెక్షన్) యాక్ట్, 2015' అమలులోకి వచ్చి పదేళ్లు పూర్తయిన సందర్భంగా న్యూఢిల్లీలో ఇవాళ ఏర్పాటు చేసిన జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో ఆయన ప్రసంగించారు. జస్టిస్ నాగరత్న నేతృత్వంలోని సుప్రీంకోర్టు జువైనల్ జస్టిస్ కమిటీ, యునిసెఫ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీజేఐ కీలక వ్యాఖ్యలు చేశారు.

**గుర్తింపు కాదు.. అది ఒక పరిస్థితి మాత్రమే:**

2015లో పార్లమెంటు వారిని 'నేరస్థులు' అనకుండా ఎలాంటి నింద మోపే పదాలు వాడకుండా 'చట్టంతో వైరుధ్యంలో ఉన్న పిల్లలు' అని పేర్కొందని గుర్తుచేశారు. ఇది కేవలం మర్యాద కోసం వాడిన పదమో వారి గుర్తింపో కాదని అది కేవలం ఒక పరిస్థితి మాత్రమేనని స్పష్టం చేశారు. 18 ఏళ్లలోపు ఉన్న ప్రతి చిన్నారికి ఎలాంటి నేరపూరిత ఉద్దేశంఉండదని ఈ చట్టం భావిస్తుందన్నారు. పిల్లలను నిర్బంధ కేంద్రాల్లో ఉంచడం చివరి ప్రత్యామ్నాయం కావాలని, వారికి కౌన్సెలింగ్, కమ్యూనిటీ సర్వీస్, ప్రోబేషన్ అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు సరికొత్త ప్రారంభాన్ని అందించాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఎలాంటి వివక్ష ఎదుర్కోకుండా ఆ చిన్నారిని తిరిగి కుటుంబం, పాఠశాల, సమాజంలో ఒక భాగస్వామిగా పునరుద్ధరించినప్పుడే నిజమైన పునరావాసం లభించినట్లవుతుందని వ్యాఖ్యానించారు.

# పెరిగిన భూముల రిజిస్ట్రేషన్లు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** భూముల అంశంపై రాజకీయ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న ఆరోపణలు, తప్పుడు ప్రచారాలను ప్రజలు ఏమాత్రం నమ్మలేదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో గతేడాదితో పోలిస్తే ఆస్తుల రిజిస్ట్రేషన్లు గణనీయంగా పెరిగాయని, బీఆర్ఎస్ అవాస్తవ ప్రచారాన్ని ప్రజలే తిప్పికొట్టారనడానికి ఈ లెక్కలే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు మంత్రి 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా వివరాలు వెల్లడించారు.

**21.75 శాతం పెరిగిన ఆదాయం:**

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం గణనీయంగా పెరగడం, రిజిస్ట్రేషన్ల సంఖ్య గత ఏడాది కంటే అధికంగా నమోదు కావడమే రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థవంతమైన పరిపాలనకు నిదర్శనమని మంత్రి తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే వ్యవసాయ, వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్లు బాగా పెరిగాయని చెప్పారు. ముఖ్యంగా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం గత ఏడాదితో పోలిస్తే 21.75 శాతం వృద్ధిని సాధించిందని వెల్లడించారు.

**భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం:**

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన భూ అక్రమాలను ప్రభుత్వం నిగ్గు తేలుస్తోందని మంత్రి పొంగులేటి తెలిపారు. అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతూ, ప్రజలకు ఎలాంటి వివాదాలు లేని భూములను అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని చెప్పడానికి ఈ గణాంకాలే రుజువని ఆయన అభిప్రాయపడ్డారు.

# అభిజీత్ దీప్కే ఇంట తీవ్ర విషాదం..

**ఢిల్లీ :** సీఈసీకి వ్యతిరేకంగా ఢిల్లీలో ఆందోళన కొనసాగుతున్న వేళ కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆయన నానమ్మ సావిత్రిబాయి దీప్కే (85) శనివారం ఉదయం కన్నుమూశారు. మహారాష్ట్రలోని హింగోలి జిల్లా సంతుక్ పింప్రి గ్రామంలో ఆమె తుదిశ్వాస విడిచారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

**పోలీసుల అదుపులోకి తీసుకున్న గంటలకే:**

ఇవాల జంతర్ మంతర్ వద్ద నిరసనకు సీజేపీ పిలుపు ఇచ్చింది. ఈ ఆందోళనల్లో పాల్గొనేందుకు ఇవాళ ఉదయం ముంబయి నుంచి సీజేపీ ముఖ్యనేతలు అభిజీత్ దీప్కే, సౌరవ్ దాస్, అశుతోశ్ రంకాను ఢిల్లీ ఎయిర్ పోర్టులో విమానంలోనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అభిజీత్ దీప్కేను పోలీసులు అదుపులోకి తీసుకున్న కొన్ని గంటలకే ఆయన నానమ్మ మరణవార్త వెలువడింది. ప్రస్తుతం అభిజీత్ పోలీసులు అదుపులో ఉండటంతో ఆయనకు నానమ్మ మరణవార్త చేరిందా లేదా అనేది స్పష్టంగా తెలియరాలేదు. ఈ విషయం ఆయనకు తెలియజేసిన తర్వాత, హింగోలికి వెళ్లేందుకు పోలీసులు ఏర్పాట్లు చేసే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

**నిరసన నేపథ్యంలో భద్రత కట్టుదిట్టం:**

మరోవైపు అభిజీత్ దీప్కే నిరసన కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లోని ఆయన నివాసం వద్ద పోలీసులు భద్రతను పెంచారు. ఆయన ఇంటి వద్ద పోలీసుల నిఘా మరింత కట్టుదిట్టం చేశారు. గతంలో ఇంటి వద్ద ఒక పోలీసు గార్డు ఉండగా తాజా పరిస్థితుల దృష్ట్యా పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుంచి 20 మంది సిబ్బందితో కూడిన బృందాన్ని మోహరించినట్లు తెలుస్తోంది.

# రైతు కష్టంపై ఎమ్మార్వో వెటకారం

**గజ్వేల్,ఫ్లాష్ ఇండియా :** వ్యవసాయ భూమి సమస్యతో ఇబ్బందులు పడుతున్న ఓ రైతు న్యాయం కోసం గజ్వేల్ ఎమ్మార్వోను ఆశ్రయించగా, ఆయన అవహేళనగా మాట్లాడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. "నువ్వు ఇంకా పురుగుల మందు తాగలేదా.. బతికే ఉన్నావా?" అంటూ ప్రశ్నించడమే కాకుండా, తన పరిస్థితి చూసి నవ్వుతారా అని రైతు అడిగితే "అవును.. నవ్వు వస్తది, బరాబర్ వస్తది" అని సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది. రైతు కష్టాన్ని అర్థం చేసుకుని భరోసా ఇవ్వాల్సిన అధికారి ఇలా మాట్లాడటం బాధాకరమని. ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఒడిపోయినప్పుడు మాత్రమే రిగ్గింగ్ అనిపిస్తుందా?

**ఢిల్లీ :** భారత ఎన్నికల సంఘం నిర్ణయాలకు వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగుతున్న వేళ ఈసీకీ మద్దతుగా 124 మంది రిటైర్డ్ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు బహిరంగ లేఖ రాశారు. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు చేయాలంటే వాటికి విశ్వసనీయమైన ఆధారాలు ఉండాలని వారు స్పష్టం చేశారు. ఆధారాలు లేకుండా ఓట్ల చోరీ, ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని ప్రచారం చేయడం ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు భారత పౌరులను ఉద్దేశించి బహిరంగ లేఖ విడుదల చేశారు.

**వ్యవస్థను అనుమానిస్తున్నారా? లేక ఫలితాన్నా?**

ఓటర్ల జాబితాల్లో అవకతవకలు జరిగాయని, ఓట్ల చోరీకి పాల్పడ్డారని ఆరోపిస్తూ ప్రతిపక్ష నేతలు ఎన్నికల సంఘంపై నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. మీరు గెలిచినప్పుడు సరైనదిగా అనిపించిన వ్యవస్థే, మీరు ఓడిపోయినప్పుడు మాత్రం రిగ్గింగ్ అని ఎలా అనిపిస్తుంది? మీరు నిజంగా అనుమానిస్తున్నది ఎన్నికల వ్యవస్థను మాత్రమేనా లేక వెలువడిన ఫలితాన్నా? అని నిలదీశారు. ప్రజల చేతిలో తిరస్కరణకు గురయ్యాక, రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే సరైన ఆధారాలు లేకుండా ఇలాంటి కథనాలను అల్లుతున్నారని మండిపడ్డారు.

**ఈవీఎంల భద్రత--పారదర్శక ప్రక్రియ**

ఎన్నికల వ్యవస్థ ఎవరినీ గుడ్డిగా నమ్మదని, ప్రతి దశలోనూ పారదర్శకత ఉంటుందని లేఖలో వివరించారు. పోలింగ్ సమయంలోనూ, అనంతరం ఈవీఎంలను సీల్ చేసేటప్పుడు అన్ని రాజకీయ పార్టీల ఏజెంట్లు సమక్షంలోనే ఉంటారు. ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లను అభ్యర్థులు లేదా వారి ప్రతినిధులు నేరుగా పర్యవేక్షించవచ్చని VVPAT పేపర్ స్లిప్పులను మెషిన్ లెక్కింపుతో సరిపోల్చే పద్ధతిని 2024లో సుప్రీంకోర్టు సమర్థించిందని గుర్తుచేశారు.

**భారీ కుట్ర సాధ్యాసాధ్యాలు:**

ఎన్నికల ఫలితాలను మార్చాలంటే వేలాది మంది అధికారులు, వివిధ రాజకీయ పార్టీల పోలింగ్ ఏజెంట్లు అందరూ కలసి కుట్ర చేయాల్సి ఉంటుందని ఇది ఆచరణలో ఏమాత్రం సాధ్యం కాదని అధికారులు స్పష్టం చేశారు. అలాగే 1995 సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎన్నికల కమిషన్ బహుళ సభ్యుల సంస్థగా మారిందని ఏ ఒక్క వ్యక్తి ఏకపక్ష నిర్ణయాలు తీసుకోలేరని వివరించారు.



# చిల్లర అని చులకనగా చూడొద్దు !

**లక్షెట్టిపేట,ఫ్లాష్ ఇండియా :** కొందరు చిల్లరే కదా అని నాణేలను చులకనగా చూస్తారు. కానీ, రూ.10 నాణేలను పొదుపు చేసిన ఓ వ్యక్తి ఏకంగా స్కూటీని కొనుగోలు చేసిన వైనం పట్టణంలో ఆసక్తికరంగా మారింది. పట్టణంలోని వడ్లవాడకు చెందిన రవి జోసెఫ్ అనే వ్యక్తి రూ.1,23,000 విలువైన రూ.10 నాణేలను చెల్లించి, సరికొత్త హోండా యాక్టివా 125 సీసీ స్కూటీని శనివారం కొనుగోలు చేశాడు. రవి జోసెఫ్ వినూత్నంగా ఆలోచించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. స్థానిక జగదాంబ హోండా షోరూమ్‌లో కేవలం రూ.10 నాణేలను మాత్రమే చెల్లించి హోండా యాక్టివా 125 సీసీ స్కూటీని కొనుగోలు చేయడానికి రావడంతో షోరూమ్ యాజమాన్యం ఆశ్చర్యానికి గురైంది. వాహనం మొత్తం ధర రూ.1,23,000ను పూర్తిగా రూ.10 నాణేల రూపంలో షోరూమ్ యజమానులు పల్లెర్ల గణేష్ కుమార్, కటకం రమేష్‌లకు అందజేశాడు.

# రైతు కుటుంబాలకు గుడ్ న్యూస్..

**ఖమ్మం,ఫ్లాష్ ఇండియా :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులంతా సమష్టిగా కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని సూచించారు. ఖమ్మంలోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వరంగల్-ఖమ్మం-నల్గొండ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో డిప్యూటీ సీఎం ప్రసంగించారు. జిల్లా స్థాయి సమావేశం అనంతరం ఐదు శాసనసభ నియోజకవర్గాల్లో, ఆ తర్వాత మండల, గ్రామస్థాయుల్లో సమావేశాలు నిర్వహించి ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి నియోజకవర్గానికి సీనియర్ నాయకుడిని ఇన్‌ఛార్జిగా నియమించి, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. కాంగ్రెస్ కుటుంబాల్లోని పట్టభద్రులను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించడంతోపాటు తటస్థ ఓటర్లను కలిసి పార్టీ అభ్యర్థికి మద్దతు కూడగట్టాలన్నారు.

**ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి...**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను ఇంటింటికీ వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. రాష్ట్రంలో 3.42 కోట్ల మందికి ప్రతి నెలా ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ,స-ుమారు 72 లక్షల మంది రైతులకు రైతు భరోసా,గృహజ్యోతి పథకం కింద 53 లక్షల మందికి నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సుమారు 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ సరఫరా, 43 లక్షల మందికి చేయూత పింఛన్లు అందిస్తున్నామన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల వరకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్యం, స-ుమారు 12.5 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్,ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారంతో పాటు పాలు, రాగి జావా అందిస్తున్నామన్నారు. పేదలపై ఆర్థిక భారం తగ్గించి, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే సంక్షేమ పథకాల లక్ష్యమన్నారు. ఇల్లు లేని పేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. తొలి దశలో 4.5 లక్షల ఇళ్లకు ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున, రెండో దశలో మరో 2.5 లక్షల ఇళ్ల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. హైదరాబాద్‌లో పేదల కోసం లక్ష ఇళ్ల నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.40 వేల కోట్లు వెచ్చిస్తోందని వివరించారు. కుటుంబానికి ఆదాయాన్ని అందించే వ్యక్తి ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.5 లక్షల బీమా సాయం అందించేలా ఇందిరమ్మ బీమా పథకాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. నవంబరు 19న ఇందిరమ్మ జయంతి సందర్భంగా ఈ పథకాన్ని ప్రారంభించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యమన్నారు.

**సర్వోత్తమ్ రెడ్డి గెలుపు ప్రతి కార్యకర్త బాధ్యత..**

రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీతో సుదీర్ఘ అనుబంధం ఉందన్నారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన ఈ కుటుంబానికి తగిన గుర్తింపు ఇవ్వాల్సిన బాధ్యత కాంగ్రెస్‌పై ఉందన్నారు. సర్వోత్తమ్ రెడ్డిని పార్టీ ప్రతినిధిగా భావించి ఆయన విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను కరపత్రాల ద్వారా ప్రతి ఇంటికీ చేరవేయాలని, ఓటరు నమోదు నుంచి పోలింగ్ వరకు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశానికి డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షత వహించగా, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి, కోరం కనకయ్య తదితరులు పాల్గొన్నారు. **పట్టభద్రుల మద్దతు కూడగట్టండి..**

**కాంగ్రెస్ శ్రేణులకు పొంగులేటి పిలుపు**

జిల్లాలో ఖమ్మం-వరంగల్-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందని.. ఇందిరమ్మ ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. త్వరలోనే మరిన్ని ఉద్యోగ నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్లు విడుదల కానున్నాయని పేర్కొన్నారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తూ వారికి అండగా నిలుస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని ఆయన అన్నారు. రాబోయే ఎన్నికల్లో పట్టభద్రుల మద్దతు పొందేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రతి ఓటరుకు వివరించాలని పార్టీ నాయకులు.. కార్యకర్తలకు సూచించారు. ప్రభుత్వంపై ఆర్థిక భారం ఉన్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమం విషయంలో రాజీపడటం లేదని పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన బకాయిలను రూ.9 వేల కోట్లతో చెల్లించామని వెల్లడించారు. ఉద్యోగ నియామకాలు.. ఉద్యోగుల సంక్షేమం వంటి అంశాల్లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను పట్టభద్రులకు వివరించాల్సిన బాధ్యత కాంగ్రెస్ శ్రేణులపై ఉందన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వ-రరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, ఇల్లెందు ఎమ్మెల్యే కనకయ్య, గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఖాదర్ బాబా, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# భక్తులకు తప్పని ఇబ్బందులు!

**చంపాపేట్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ పాతబస్తీలోని ఫలక్‌నుమా ఖాళీ మాతా ఆలయానికి వచ్చే భక్తులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత కోరారు. నిత్యం వేలాది మంది భక్తులు దర్శనానికి వచ్చే ఆలయం వద్ద సరైన రహదారి లేకపోవడం, మహిళలకు మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. శుక్రవారం ఆలయాన్ని సందర్శించిన కవిత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద నెలకొన్న సమస్యలను మీడియాకు వివరించారు. ఆలయం చుట్టూ రైల్వే భూములు ఉండటం, పక్కనే శ్మశానం ఉండటంతో రహదారి నిర్మాణంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.

**అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి**

ఆలయానికి రహదారి నిర్మాణంతో పాటు తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్లు వంటి కనీస సదుపాయాలు కల్పించాల్సిన అవ-సరం ఉందని కవిత అన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రైల్వే, దేవాదాయ శాఖ అధికారులతో చర్చించి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే కూడా చొరవ చూపి భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**బతుకమ్మ శుభాకాంక్షలు**

బతుకమ్మ పండుగ ప్రారంభం సందర్భంగా తెలంగాణ ప్రజలందరికీ కవిత శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఆడపడుచులందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగ ప్రజల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేయాలని ఆమె పేర్కొన్నారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# అరెస్టుకు ముందే వీడియో..

**ఢిల్లీ :** 'కాక్రోచ్ జనతా పార్టీ' వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కేను పోలీసులు అదుపులోకి తీసుకున్న తర్వాత ఆయనకు సంబంధించిన ఒక ప్రీ-రికార్డెడ్ వీడియో మెసేజ్ బయటకు వచ్చింది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ తలపెట్టిన నిరసన ప్రదర్శన నేపథ్యంలో ఈ వీడియో వెలుగులోకి రావడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ వీడియోలో అభిజీత్ మాట్లాడూ.. "మీరు ఈ వీడియో చూస్తున్నారంటే, నాతో పాటు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్‌లను పోలీసులు అరెస్టు చేశారని అర్థం. ఇలాంటి పరిస్థితుల్లో ఇకపై ఈ ఉద్యమానికి అజింక్యా షిండే నాయకత్వం వహిస్తారు" అని స్పష్టం చేశారు. జంతర్ మంతర్ వద్ద భారీ నిరసన చేపట్టేందుకు సిద్ధమవుతున్న తరుణంలోనే ఢిల్లీ పోలీసులు కాక్రోచ్ జనతా పార్టీ అధినేత అభిజీత్ దిప్కేతో పాటు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను కస్టడీలోకి తీసుకున్నారు. ముంబై నుంచి ఢిల్లీ వచ్చిన అభిజీత్‌ను ఐజీఐ ఎయిర్‌పోర్ట్‌లో విమానం లోపల నుంచే పోలీసులు అదుపులోకి తీసుకోవడం గమనార్హం. పోలీసులు విమానంలోకి ప్రవేశించిన సమయంలో తీవ్ర కలకలం, తీవ్ర వాగ్వాదం చోటుచేసుకున్నాయి. పోలీసులు, సీజేపీ నేతల మధ్య కొద్దిసేపు చర్చలు జరిగిన అనంతరం ఆ ముగ్గురినీ పోలీసులు రౌండప్ చేసి తీసుకెళ్లారు. పోలీసుల చర్యపై కాక్రోచ్ జనతా పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ అరెస్టులను ఖండించింది. కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడిన అభిజీత్ దిప్కే.. చివరికి ఇందిరా గాంధీ హయాంలో కూడా ఇలాంటి పరిస్థితులు లేవని, ఇప్పటి పరిస్థితి ఆనాటి కంటే దారుణంగా ఉందని మండిపడ్డారు. అరెస్టులకు తాము భయపడేది లేదని, దేనికైనా సిద్ధంగా ఉన్నామని తేల్చిచెప్పారు. ఈ పరిణామాలపై సీజేపీ ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. తాము తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉన్నామని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలనే డిమాండ్‌తో దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతాయని స్పష్టం చేసింది. సీనియర్ నాయకత్వం అందుబాటులో ఉన్నా లేకపోయినా తమ ఆందోళన ఆగదని తేల్చిచెప్పింది. అంతేకాకుండా, దేశంలోని యువత, ప్రజలంతా ముందుకు వచ్చి మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ఈ ఉద్యమాన్ని ముందుకు నడిపించాలని పిలుపునిచ్చింది.

# అన్యాయాలను సరిదిద్దుదాం

**ఢిల్లీ :** భారత ప్రజల గొంతుకను కాపాడుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బీజేపీ ప్రభుత్వ పాలనలో జరిగిన అన్యాయాలను అందరం కలిసి సరిదిద్దుతామని పేర్కొన్నారు. గత దశాబ్ద కాలంలో దేశానికి జరిగిన పరిణామాలు మళ్లీ పునరావృతం కాకుండా చూస్తామని స్పష్టం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ ఈ దేశ యువత చేపట్టిన ఆందోళను విరమించవద్దని రాహుల్ గాంధీ చేసిన ట్వీట్‌పై సీఎం రేవంత్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా స్పందించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాటలను ప్రస్తావిస్తూ.. భారత ప్రజల గొంతుకను పరిరక్షిస్తామని తెలిపారు. నైతిక విలువలు కోల్పోయిన బీజేపీ ప్రభుత్వం చేసిన తప్పులను సమష్టిగా సరిదిద్దుతామని పేర్కొన్నారు. గత పదేళ్లలో భారతదేశంలో చోటుచేసుకున్న పరిణామాలు మరోసారి జరగకుండా చూస్తామని, 'ఓటును కాపాడుకుందాం.. దేశాన్ని కాపాడుకుందాం' అనే నినాదంతో ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాగా, సీజేపీ నేతృత్వంలో ఇవాళ ఢిల్లీలో యువత చేపట్టిన ఆందోళనలపై రాహుల్ గాంధీ రియాక్ట్ అయ్యారు. యువతకు అండగా మేమున్నామని మీ పోరాటం ఆపొద్దన్నారు. నిరసనకారులను పోలీసులు అడ్డుకోవడంపై మోడీ జీ.. మీకు నచ్చినట్లు చేయండి. పోలీసులందరినీ రంగంలోకి దించండి. 10 వేలు.. 20 వేలు.. 50 వేలు.. ఇలా ఎంతమందినైనా సరే. నాయకులందరినీ.. యువతను.. ఇలా అందరినీ అరెస్టు చేయండి. ఏం చేసుకుంటారో చేసుకుండి మేము మాత్రం వెనక్కి తగ్గం అని రాహుల్ గాంధీ హెచ్చరించారు.

# మొన్న ఫారం-6.. ఇప్పుడు ఫారం-7..

**ఢిల్లీ :** ఎస్ఐఆర్ ప్రక్రియ, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తీరు దేశ రాజకీయాలను కుదిపేస్తున్న తరుణంలో భారత ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించేందుకు ఫారమ్-7 విషయంలో పరిమితులు విధించింది. ఇకపై ఒక వ్యక్తి ఫారమ్ -7 ను గరిష్టంగా కేవలం 10 మాత్రమే దాఖలు చేసేందుకు అనుమతిని ఇస్తూ లిమిట్స్ విధించింది. ముఖ్యంగా ఓ వర్గానికి చెందిన ఓటర్లను టార్గెట్ చేసుకుని పెద్ద సంఖ్యలో ఓట్లు తొలగించేందుకు బీజేపీ పార్టీకి చెందిన బూత్ లెవల్ ఏజెంట్లు ప్రీ ప్రింటెడ్ ఫారమ్ -7 ను దాఖలు చేస్తున్నారనే ఆరోపణలు తెలంగాణ సహా మరికొన్ని రాష్ట్రాల్లో ఆరోపణలు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ దుర్వినియోగం కాకుండా, అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించకుండా నిరోధించడానికి ఈసీఐ ఈ నిర్ణయం తీసుకుంది.

**మొన్న ఫారం-6 నేడు ఫారం-7:**

కర్ణాటకలోని బళ్లారితో సహా పలు నియోజకవర్గాల్లో భారీ ఎత్తున ఫారమ్-7లను దాఖలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఈసీ దృష్టికి తీసుకెళ్లింది. ఇటీవలే తెలంగాణలో ముషీరాబాద్, బహదూర్‌పురతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అనేక నియోజకవర్గాల్లో ఫారమ్ -7 అంశం వివాదాస్పదం అయింది. ముషీరాబాద్‌లో ఓ బీజేపీ బీఎల్ఏ నిబంధలనకు విరుద్ధంగా ఫారమ్-7 లు బల్క్ గా సమర్పించడంపై ఇప్పటికే పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో చర్యలకు దిగిన ఈసీఐ తాజాగా నిబంధనలను మరింత కఠినతరం చేసింది. రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్ 1960లోని రూల్ 13(2) ప్రకారం ఒక నియోజకవర్గంలో పేరు తొలగింపునకు దరఖాస్తు చేసే వ్యక్తి పేరు తప్పనిసరిగా అదే నియోజకవర్గ ఓటర్ల జాబితాలో ఉండాలని స్పష్టం చేసింది. అయితే ఎస్ఐఆర్ లో ఫారం 6 డిక్లరేషన్ లేదని మొన్న చెప్పిన ఈసీఐ తాజాగా ఫారం7 విషయంలో మార్పులు చేయడం హాట్ టాపిక్‌గా మారింది.

**రాజకీయ పార్టీల ఏజెంట్లకు కుదింపు:**

ప్రత్యేక సవరణ సమయంలో రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు బీఎల్ఓకి రోజుకు డ్రాఫ్ట్ పబ్లికేషన్‌కు ముందు 50 దరఖాస్తులు, ఆ తర్వాత రోజుకు 10 దరఖాస్తులు మాత్రమే సమర్పించేందుకు అనుమతి ఇచ్చారు. సరైన ఆధారాలు లేకుండా లేదా నిర్ణీత గడువు దాటిన తర్వాత వచ్చిన దరఖాస్తులను ఈఆర్ఓలు తిరస్కరిస్తారు. నిబంధనల ప్రకారం ఉన్న దరఖాస్తుదారులకు మొదట నోటీసు జారీ చేసి, వారిని స్వయంగా విచారించి, స్టేట్‌మెంట్లు నమోదు చేసిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటారు. తప్పుడు పత్రాలతో, రాజకీయ కుట్రలతో వేసే వ్యాజ్యాలు, తప్పుడు ఫారమ్-7 దరఖాస్తులపై ప్రజాప్రతినిధుల చట్టం 1950 ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేసి ప్రాసిక్యూట్ చేయాలని ఈఆర్ఓలను ఎన్నికల సంఘం ఆదేశించింది.

# రూ.70కోట్లతో పోలేపల్లిలో అభివృద్ధి

**ఖమ్మం,ఫ్లాష్ ఇండియా :** ఖమ్మం రూరల్ మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా రూ.4.65 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రెండు నూతన బీటీ రోడ్ల నిర్మాణ పనులకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఇందులో రూ. 2.42 కోట్ల అంచనా వ్యయంతో పోలేపల్లి నుంచి దానవాయిగూడెం(వయా మున్నేరు) వరకు, రూ. 2.20 కోట్ల అంచనా వ్యయంతో పోలేపల్లి నుంచి రామునిపేట వరకు బీటీ రోడ్ల నిర్మాణాలు ఉన్నాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. సన్న బియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్(200 యూనిట్లు), ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు వంటి అనేక కార్యక్రమాలు విజయవంతంగా అందిస్తున్నామన్నారు. పోలేపల్లి ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రాబోయే కొద్ది రోజుల్లోనే నూతన రేషన్ డీలర్‌ను ఏర్పాటు చేస్తామని మంత్రి అన్నారు. అర్హులైన ప్రతి పేదవానికి విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ స్కూల్ లో స్థల సమస్య ఉన్నందున, సమీపంలో అనువైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి పిల్లలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నూతన స్కూల్ భవనాన్ని నిర్మిస్తామని మంత్రి తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాల అమలుకు కట్టుబడి ఉన్నామని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, హౌసింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, పిఆర్ ఈఈ మహేష్ బాబు, స్థానిక సర్పంచ్ బత్తిని మహేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌ఆర్-2 టెండర్లలో భారీ స్కామ్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రూ.3,296 కోట్ల విలువైన రేడియల్ రోడ్-2 టెండర్లలో భారీ కుంభకోణం జరిగిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. బుద్వేల్ నుంచి కొడంగల్ వరకు కొత్తగా చేపట్టనున్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణ పనుల్ని ప్యాకేజీలుగా, ముక్కలుగా విభజించి ముందస్తుగా నిర్ణయించుకున్న నచ్చిన వారికే టెండర్లు కట్టబెట్టారని మండిపడ్డారు. తక్కువ ధరకు బిడ్లు వేసిన అర్హులైన సంస్థలను పక్కన పెట్టి, సాంకేతిక కారణాల పేరుతో ఇతరులను తొలగించి, ఎక్కువ ధరకు కోట్ చేసిన కంపెనీలకు పనులు కేటాయించడం ద్వారా వందల కోట్ల ప్రజాధనం వృధా అవుతోందని విమర్శించారు. వెంటనే ఈ టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

**రికార్డులు బయటపెట్టాలి..**

ఈ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని, టెండర్ల తాలూకు అన్ని పత్రాలను బహిరంగపరచాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రతి అనర్హతకు నిర్దిష్ట కారణాలు తెలుపుతూ సాంకేతిక మూల్యాంకన నివేదికతో పాటు మూడు ప్యాకేజీల అంచనా వ్యయాలు, తుది కేటాయింపు విలువలు, బిడ్డర్ల ఆర్థిక బిడ్ల వివరాలను విడుదల చేయాలని కోరారు. బిడ్ ఓపెనింగ్, కంపారేటివ్ స్టేట్మెంట్లు, మూల్యాంకన కమిటీ సమావేశాల మినిట్స్‌తో కూడిన రికార్డులను బయటపెట్టాలన్నారు. రూ.600 కోట్ల ఆర్థిక నష్టం ఆరోపణలపై సమగ్ర పరిశీలన జరిపించాలని, హెచ్ఎండీఏ, హెచ్ జీసీఎల్ పరిధిలోని రూ.100 కోట్లకు పైబడిన కాంట్రాక్టులపై కాగ్ తో ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

**సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలి..**

ఈ టెండర్లపై సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయడంతో పాటు, టెండర్ల ప్రక్రియలో పారదర్శకత కోసం స్పష్టమైన నిబంధనలు అమలు చేయాలని కేటీఆర్ స్పష్టం చేశారు. సాంకేతిక అర్హతలపై నిర్ణయాలు, బిడ్డర్లకు వివరణ ఇచ్చేందుకు కల్పించే అవకాశం, టెక్నికల్ ఫలితాల తర్వాత ఫైనాన్షియల్ బిడ్లు తెరవడానికి అనుసరించే వ్యవధి వంటి అంశాలపై పక్కా నిబంధనలు ఉండాలని కోరారు. ప్రజాధనాన్ని కాపాడేందుకు తక్షణమే ఈ టెండర్లను రద్దు చేసి పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని ఆయన ఆ లేఖలో డిమాండ్ చేశారు.

# గెలిస్తే పొగడడం.. ఓడితే తిట్టడమా?



**అమరావతి,ఫ్లాష్ ఇండియా :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను రద్దు చేయాలని, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆందోళనలపై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధమైన సంస్థలను రాజకీయాలతో ముడిపెట్టడం, వ్యక్తిగత విమర్శలకు దిగడం సరికాదని హితవు పలికారు. నిరాధార ఆరోపణలతో సీఈసీ, ప్రధాన మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం సమంజసం కాదని స్పష్టం చేశారు. అమరావతిలో శనివారం మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఓట్లను మూకుమ్మడిగా తొలిగించారనేది కేవలం అపోహ మాత్రమేనని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలిస్తే తమ ఘనతగా చెప్పుకోవడం, ఓడిపోతే ఈవీఎంలను నిందించడం హాస్యాస్పదమన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ను కించ పరిచే ప్రయత్నాలు చేయొద్దని సూచించారు. దేశంలో అమలవుతున్న ప్రజాస్వామ్య వ్యవస్థను మనమే అవహేళన చేసుకోవడం మంచిది కాదన్నారు. భారతదేశ అభివృద్ధిని చూసి కొన్ని పాశ్చాత్య దేశాలు ఓర్వలేక పోతున్నాయని అభిప్రాయపడ్డారు. సీఈసీ నియామక ప్రక్రియలో భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) భాగస్వామిగా ఉండటం సరైంది కాదని వెంకయ్య నాయుడు అన్నారు. ఓటర్ల జాబితా నుంచి ఓట్లను కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో తొలగిస్తున్నారంటూ కొందరు ఆరోపణలు చేస్తున్నారని, అయితే ఈ ప్రక్రియలో ఏఐని ఉపయోగించడం లేదని స్పష్టం చేశారు.

**భారత ఆర్థిక వ్యవస్థపై వ్యాఖ్యలు బాధించాయి**

భారతదేశం దివాళా తీసిందంటూ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు చేసిన వ్యాఖ్యలు తనకు కోపంతో పాటు ఆవేదన కలిగించాయని వెంకయ్య నాయుడు తెలిపారు. అయితే, మరుసటి రోజే ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) ప్రకటించిందని గుర్తుచేశారు. దేశానికి లభిస్తున్న ఈ గుర్తింపు కేవలం ప్రధాని నరేంద్ర మోదీ ఘనత మాత్రమే కాదని, ప్రజలందరి కృషి ఫలితమని పేర్కొన్నారు.

# ఇందిరాగాంధీ స్టేడియంలో మళ్లీ దసరా సందడి !




**కామారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** కామారెడ్డి పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈ ఏడాది నుంచి దసరా ఉత్సవాలను తిరిగి ఘనంగా నిర్వహిస్తామని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ప్రకటించారు. శనివారం స్టేడియంలో కోటి రూపాయల వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఫ్లడ్‌లైట్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. షబ్బీర్ అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గతంలో ఏటా దసరా ఉత్సవాలు, రావణ దహనం, లేజర్ షోలను ఘనంగా నిర్వహించేవారమని, కరోనా కారణంగా విరామం ఏర్పడిందని తెలిపారు. ఈ ఏడాది నుంచి తిరిగి ఉత్సవాలను పునఃప్రారంభిస్తామని చెప్పారు. 1990లో తొలిసారిగా మల్లన్నగుట్ట వద్ద రావణ దహనం, లేజర్ షోతో దసరా ఉత్సవాలను ప్రారంభించామని గుర్తుచేశారు. అనంతరం నాలుగేళ్ల పాటు సీఎస్ఐ గ్రౌండ్‌లో, ఆ తర్వాత ఇందిరాగాంధీ స్టేడియం అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి సుమారు 20 ఏళ్ల పాటు అక్కడే వేడుకలను నిర్వహించామని వివరించారు. కొన్ని రాజకీయ ఒత్తిళ్లు, అనివార్య కారణాల వల్ల గత నాలుగేళ్లుగా ఉత్సవాలను నిర్వహించలేకపోయామని తెలిపారు. ఈ ఏడాది ఆకర్షణీయమైన లేజర్ షోతో పాటు రావణ దహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామని వెల్లడించారు. దసరా ఉత్సవాల నిర్వహణ కోసం త్వరలో ప్రత్యేక ఉత్సవ కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు. స్టేడియంలో ఫ్లడ్‌లైట్ల ఏర్పాటుతో క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, కౌన్సిలర్లు, నాయకులు అన్వర్, షేరు, సత్యం, సిద్ధిక్, అంజాద్, యూనుస్, చిట్టిబాబు, గంగాధర్, లోలం శ్రీనివాస్, లక్ష్మణ్, మన్సూర్, గేరిగంటి స్వప్న, పిట్ల వేణు, ఏజాజ్, గూడెం శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సందీప్, మండల అధ్యక్షుడు రాజా గౌడ్, భూమని బాలరాజు, అనుమాల రాముకుమార్, ఇంద్రకరణ్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, పండ్ల రాజు, కన్నయ్య, నరేందర్‌రెడ్డి, గౌనె శ్రీనివాస్, ముబషీర్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతుల ప్రయోజనమే లక్ష్యం సాగునీటి విడుదల

## పంటలు పండే వరకు అండగా ఉంటాం: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయ రమణారావు





**పెద్దపల్లి,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు శుభవార్త అందింది. పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని పంటలకు నీరందించేందుకు శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేశారు. రైతుల పంటలను కాపాడాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. శనివారం నిజామాబాద్ జిల్లా పోచంపాడు వద్ద ఎస్సారెస్పీ నుంచి నీటిని విడుదల చేయగా, రేవెల్లి డిస్ట్రిబ్యూటరీ ద్వారా డి-86, డి-83 ప్రధాన కాలువల నుంచి పెద్దపల్లి నియోజకవర్గంలోని పంటలకు సోమవారం వరకు సాగునీరు అందనుంది. ఎల్‌నినో ప్రభావంతో సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో రైతుల పంటలు ఎండిపోకుండా నీటి విడుదలకు కృషి చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

**రైతులు ఆందోళన చెందవద్దు**

పంటలు చేతికి వచ్చే వరకు రైతులకు అండగా ఉంటామని విజయ రమణారావు భరోసా ఇచ్చారు. రైతుల ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా సాగునీటి సరఫరా కోసం నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. అందుబాటులోకి వచ్చిన నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు.

**మంత్రులకు కృతజ్ఞతలు**

పెద్దపల్లి నియోజకవర్గ రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి విడుదలకు సహకరించిన రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబులకు ఎమ్మెల్యే విజయ రమణారావు కృతజ్ఞతలు తెలిపారు. సాగునీటి సరఫరాతో పంటలకు మేలు జరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కొవిడ్ తరహాలో ఎల్ నినో పంజా..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో ఎల్ నినో పరిస్థితుల కారణంగా భవిష్యత్తులో తలెత్తే తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం కీలకమైన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. కోవిడ్ సమయంలో అనుసరించిన వ్యూహం తరహాలోనే ఎల్ నినోపైనా ఒక పటిష్టమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రాబోయే జూన్ వరకు పరిస్థితులను అంచనా వేస్తూ ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు. ఈ భేటీలో తాగు, సాగునీటి సమస్యలతో పాటు విద్యుత్ రంగంపై పడబోయే ప్రభావం గురించి సీఎం తీవ్రంగా చర్చించారు. విద్యుత్ కొరత తీవ్రతరం అయ్యే ప్రమాదం ఉందని, బహిరంగ మార్కెట్లో తగినంత విద్యుత్ అందుబాటులో లేనందున ఎంత ఖర్చు చేయడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అయితే, అందుబాటులో ఉన్న కరెంట్‌ను అత్యంత పొదుపుగా వాడుకోవాలని, వ్యవసాయేతర లేదా విద్యుత్ ఆధారిత పనులను తాత్కాలికంగా వాయిదా వేస్తే మంచిదని సూచించారు. నీటి ఎద్దడి తలెత్తకుండా, చుక్క నీరు కూడా వృథా కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈ కార్యాచరణలో ప్రతి ఒక్కరిని భాగస్వాములం చేయాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలకు ఎల్ నినో ప్రభావంపై అవగాహన కల్పించాలని, ఇందుకోసం సినిమా, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మరియు సోషల్ మీడియా వేదికలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

## సంపాదకీయం




# హరిత విద్యుత్‌తో వెలుగుల తెలంగాణ..

తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో విద్యుత్ రంగం కీలక మలుపు తిరుగుతోంది. ఒకప్పుడు పరిశ్రమల స్థాపనకు, వ్యవసాయానికి, గృహ అవసరాలకు విద్యుత్ సరఫరా చేయడమే ప్రధాన లక్ష్యంగా ఉండేది. కానీ మారుతున్న కాలంలో విద్యుత్ అవసరాల స్వరూపం పూర్తిగా మారుతోంది. గ్లోబల్ డేటా సెంటర్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, భారీ పారిశ్రామిక యూనిట్లు, ఆధునిక నగరాలు, ఫ్యూచర్ సిటీ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు రాష్ట్ర విద్యుత్ డిమాండ్‌ను మరింత పెంచనున్నాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పునరుత్పాదక ఇంధన వనరుల వైపు తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. సౌర, పవన విద్యుత్‌తో పాటు బ్యాటరీ నిల్వ వ్యవస్థలు, నిరంతర విద్యుత్ సరఫరా విధానాలకు ప్రాధాన్యం ఇవ్వడం రాష్ట్ర ఇంధన రంగానికి కొత్త అవకాశాలను తెరుస్తోంది.తెలంగాణ ప్రభుత్వం 2025లో తీసుకొచ్చిన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ ఈ దిశలో ఒక విధానపరమైన అడుగు. సౌరశక్తి, పవనశక్తి, ఇంధన నిల్వ వ్యవస్థలు, గ్రీన్ హైడ్రోజన్ వంటి రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించడం ఈ విధానంలోని ముఖ్యమైన అంశాలు. రాష్ట్రానికి అందుబాటులో ఉన్న సౌర వికిరణం, పవన విద్యుత్ సామర్థ్యం వంటి వనరులను సమర్థంగా వినియోగించుకుంటే విద్యుత్ ఉత్పత్తిని విస్తరించడంతో పాటు కొత్త పరిశ్రమలకు అవకాశాలు కల్పించవచ్చు. పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు, స్పష్టమైన అనుమతుల ప్రక్రియ, మౌలిక సదుపాయాల అభివృద్ధి కలిసివస్తే తెలంగాణ క్లీన్ ఎనర్జీ రంగంలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకునే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వ అధికారిక పెట్టుబడుల పోర్టల్ కూడా పునరుత్పాదక విద్యుత్, బ్యాటరీ తయారీ, గ్రీన్ హైడ్రోజన్, ఈవీ ఛార్జింగ్ వంటి రంగాలను భవిష్యత్ అవకాశాలుగా గుర్తిస్తోంది.ఇటీవల సౌర, పవన విద్యుత్ కొనుగోలు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ వ్యవస్థల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు ఈ వ్యూహంలో భాగంగా చూడాలి. వార్తా నివేదికల ప్రకారం, 3,000 మెగావాట్ల సౌర విద్యుత్‌తో పాటు 6,000 మెగావాట్ అవర్ బ్యాటరీ నిల్వ సామర్థ్యంతో కూడిన ప్రాజెక్టుకు అనుమతి, 800 మెగావాట్ల పవన విద్యుత్ కొనుగోలు, 2,000 మెగావాట్ల నిరంతర పునరుత్పాదక విద్యుత్ సేకరణకు సంబంధించిన నిర్ణయాలు తీసుకున్నారు. అలాగే రామగుండం, శంకర్‌పల్లి ప్రాంతాల్లో బ్యాటరీ నిల్వ ప్రాజెక్టులను అభివృద్ధి చేసే ప్రతిపాదనలూ ముందుకు వచ్చాయి. ఈ ప్రాజెక్టుల అమలు దశలవారీగా ముందుకు సాగితే రాష్ట్ర విద్యుత్ వ్యవస్థకు అదనపు సామర్థ్యం, సరఫరాలో సౌలభ్యం లభించే అవకాశం ఉంది.సౌర, పవన విద్యుత్‌లకు ఒక సహజ పరిమితి ఉంది. సూర్యకాంతి ఉన్నప్పుడు సౌర విద్యుత్ ఉత్పత్తి ఎక్కువగా ఉంటుంది. గాలి వేగాన్ని బట్టి పవన విద్యుత్ ఉత్పత్తి మారుతుంది. అయితే విద్యుత్ వినియోగం మాత్రం పగలు, రాత్రి అనే తేడా లేకుండా కొనసాగుతుంది. ముఖ్యంగా డేటా సెంటర్లు, ఆసుపత్రులు, పరిశ్రమలు, రవాణా వ్యవస్థలకు నిరంతర విద్యుత్ సరఫరా అవసరం. ఇక్కడే బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ వ్యవస్థల ప్రాముఖ్యత పెరుగుతుంది. విద్యుత్ ఉత్పత్తి అధికంగా ఉన్న సమయంలో నిల్వ చేసి, డిమాండ్ పెరిగినప్పుడు వినియోగానికి అందించడం ద్వారా సరఫరా వ్యవస్థపై ఒత్తిడిని తగ్గించవచ్చు. రౌండ్ ది క్లాక్ విధానం ద్వారా రోజంతా పునరుత్పాదక విద్యుత్ అందుబాటులో ఉండేలా ప్రయత్నించడం కూడా ఈ అవసరానికి అనుగుణమైన చర్య.రాష్ట్ర ఆర్థికాభివృద్ధితో విద్యుత్ రంగానికి ఉన్న అనుబంధం మరింత బలపడుతోంది. ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్డు పరిసరాల్లో ప్రతిపాదిత పారిశ్రామిక క్లస్టర్లు, డేటా సెంటర్లు, ఈవీ తయారీ మరియు ఛార్జింగ్ మౌలిక సదుపాయాలు విస్తరిస్తే విద్యుత్ అవసరాలు పెరుగుతాయి. ముందుగానే ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, గ్రిడ్‌ను ఆధునీకరించడం, నిల్వ వ్యవస్థలను అభివృద్ధి చేయడం ద్వారా కొత్త పెట్టుబడులకు అవసరమైన మౌలిక వసతులను సిద్ధం చేయవచ్చు. విశ్వసనీయమైన విద్యుత్ సరఫరా పరిశ్రమలకు మాత్రమే కాకుండా ఉద్యోగాల కల్పనకు, సేవారంగ విస్తరణకు, చిన్న వ్యాపారాల అభివృద్ధికి కూడా తోడ్పడుతుంది. పునరుత్పాదక విద్యుత్ రంగంలో ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణ, పరికరాల తయారీ, సాంకేతిక సేవల ద్వారా కొత్త ఉపాధి అవకాశాలు సృష్టించే వీలుంది.అయితే హరిత విద్యుత్ లక్ష్యాలను ప్రకటించడం ఎంత ముఖ్యమో, వాటిని ఆర్థికంగా స్థిరమైన పద్ధతిలో అమలు చేయడం కూడా అంతే ముఖ్యం. దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో ధరలు, చెల్లింపుల నిబంధనలు, బ్యాటరీల నిర్వహణ, వాటి జీవితకాలం ముగిసిన తర్వాత మార్పిడి ఖర్చులు స్పష్టంగా ఉండాలి. పారదర్శకమైన పోటీ బిడ్డింగ్ ద్వారా సమంజసమైన ధరలకు విద్యుత్ కొనుగోలు జరిగేలా చూడాలి. అవసరమైన ప్రసార లైన్లు, గ్రిడ్ అనుసంధానం, విద్యుత్ నిల్వ సామర్థ్యాలపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలి. ఈ నిర్ణయాల వల్ల డిస్కంల ఆర్థిక పరిస్థితిపై ఎలాంటి ప్రభావం పడుతుందో ముందుగానే అంచనా వేయడం అవసరం. ఖర్చుల నిర్వహణలో జాగ్రత్త వహిస్తేనే విద్యుత్ ధరలపై అనవసర భారం పడకుండా అభివృద్ధి లక్ష్యాలను సాధించవచ్చు.అదేవిధంగా పర్యావరణ పరిరక్షణ, భూసేకరణ, స్థానిక ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. సౌర, పవన ప్రాజెక్టులు ఏర్పాటు చేసే ప్రాంతాల్లో పర్యావరణ ప్రమాణాలను పాటించడం, ప్రభావిత ప్రజల సమస్యలను పరిష్కరించడం, బ్యాటరీల పునర్వినియోగం మరియు వ్యర్థాల నిర్వహణకు తగిన వ్యవస్థలు ఏర్పాటు చేయడం అవసరం. గ్రామీణ ప్రాంతాల్లో వికేంద్రీకృత సౌర విద్యుత్, ప్రభుత్వ భవనాలపై రూఫ్‌టాప్ సోలార్, వ్యవసాయ పంపులకు సౌరశక్తి వంటి కార్యక్రమాలను విస్తరించడం ద్వారా హరిత విద్యుత్ ప్రయోజనాలను మరింత విస్తృత ప్రజానీకానికి చేరవేయవచ్చు.తెలంగాణకు హరిత విద్యుత్ రంగం కేవలం విద్యుత్ ఉత్పత్తిని పెంచుకునే మార్గం మాత్రమే కాదు; పారిశ్రామికాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, సాంకేతిక ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలను అనుసంధానించే అభివృద్ధి వేదిక. భవిష్యత్ అవసరాలను ముందుగానే అంచనా వేసి సౌర, పవన విద్యుత్‌తో పాటు నిల్వ సాంకేతికతపై దృష్టి పెట్టడం రాష్ట్రానికి కొత్త అవకాశాలను అందించగలదు. ఇప్పుడు అవసరమైనది నిర్ణయాలను వేగంగా, పారదర్శకంగా అమలు చేయడం; పెట్టుబడుల నాణ్యతను నిర్ధారించడం; ప్రజలకు అందుబాటు ధరల్లో నమ్మకమైన విద్యుత్‌ను అందించడం. ఈ లక్ష్యాలన్నీ సమన్వయంతో ముందుకు సాగితే తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ ఒక కీలక శక్తిగా నిలిచే అవకాశం ఉంది.

# ఆహార కొరత కాదు.. ధరల భారమే అసలు సంక్షోభం!



కిరాణా దుకాణానికి వెళ్లి నెలవారీ సరుకులు కొనుగోలు చేస్తున్న సామాన్యుడికి ఇప్పుడు ఒకటే ఆందోళన.. గత నెల కంటే ఈ నెల బిల్లు ఎందుకు పెరిగింది? ఆదాయం పెరగకపోయినా ఖర్చులు మాత్రం ఎందుకు అదుపు తప్పుతున్నాయి? బియ్యం, గోధుమలు, పప్పులు, చక్కెర, వంటనూనెల ధరలు పెరుగుతున్న కొద్దీ మధ్యతరగతి కుటుంబాల నెలవారీ బడ్జెట్ తలకిందులవుతోంది. ఆహార కొరత ఏర్పడినప్పుడే ధరలు పెరుగుతాయని సాధారణంగా భావిస్తాం. కానీ ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులు మరో వాస్తవాన్ని వెల్లడిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పంటల ఉత్పత్తి చారిత్రక స్థాయిలో ఉన్నప్పటికీ, ఆహార ధరలపై ఒత్తిడి కొనసాగుతోంది. అంటే సమస్య కేవలం పంటల దిగుబడికి సంబంధించినది కాదు. ఆహారం పండించడం నుంచి వినియోగదారుడి చేతికి చేరే వరకు ఉన్న సరఫరా వ్యవస్థ, ఇంధన ధరలు, ఎరువుల లభ్యత, రవాణా ఖర్చులు, అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలు కలిసి ఆహార మార్కెట్లను ప్రభావితం చేస్తున్నాయి.ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ (FAO) విడుదల చేసిన తాజా గణాంకాలు ఈ పరిస్థితికి అద్దం పడుతున్నాయి. 2026 సెప్టెంబరులో ప్రపంచ ఆహార ధరల సూచీ 136 పాయింట్లకు చేరింది. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 5.8 శాతం పెరిగింది. తృణధాన్యాల ధరల సూచీ ఏడాది వ్యవధిలో 17.2 శాతం పెరగగా, చక్కెర ధరల సూచీ 14.7 శాతం పెరిగింది. సెప్టెంబరులోనే తృణధాన్యాల ధరలు అంతకుముందు నెలతో పోలిస్తే 5.1 శాతం, చక్కెర ధరలు 6.1 శాతం పెరిగాయి. మరోవైపు 2026లో ప్రపంచ తృణధాన్యాల ఉత్పత్తి సుమారు 297.9 కోట్ల టన్నులకు చేరుతుందని ఫీూూ అంచనా వేస్తోంది. గత ఏడాది రికార్డు ఉత్పత్తితో పోలిస్తే ఇది 2.1 శాతం తక్కువైనా, ఇప్పటికీ చరిత్రలో రెండో అత్యధిక స్థాయి. ఉత్పత్తి ఇంత భారీగా ఉన్నప్పటికీ ధరలు పెరుగుతుండటం ప్రపంచ ఆహార వ్యవస్థలోని అంతర్గత బలహీనతలను స్పష్టం చేస్తోంది.ఈ పరిస్థితిని అర్థం చేసుకోవాలంటే ఆహారం, ఇంధనం, ఎరువులు, ఆర్థిక వ్యవస్థల మధ్య ఉన్న సంబంధాన్ని గుర్తించాలి. వీటినే సాధారణంగా '4ఎఫ్ సంక్షోభం'గా పేర్కొంటారు. రైతు పంట పండించాలంటే ఎరువులు, విద్యుత్, డీజిల్, సాగునీరు అవసరం. పంట చేతికొచ్చిన తర్వాత దానిని మార్కెట్‌కు తరలించాలి. అక్కడి నుంచి గోదాములు, ప్రాసెసింగ్ కేంద్రాలు, వ్యాపార సంస్థలు, చిల్లర దుకాణాల మీదుగా వినియోగదారుడికి చేరాలి. ఈ గొలుసులో ఏ దశలో అంతరాయం ఏర్పడినా దాని ప్రభావం చివరకు వినియోగదారుడి జేబుపైనే పడుతుంది. ఇంధన ధరలు పెరిగితే రవాణా ఖర్చులు పెరుగుతాయి. ఎరువుల ధరలు పెరిగితే సాగు వ్యయం అధికమవుతుంది. వడ్డీ రేట్లు, మారకపు విలువల్లో మార్పులు వస్తే రైతులు, వ్యాపారులు, దిగుమతిదారులపై అదనపు ఆర్థిక భారం పడుతుంది. ఈ ఖర్చులన్నీ కలిసినప్పుడు పంటల ఉత్పత్తి సమృద్ధిగా ఉన్నా మార్కెట్లో ధరలు తగ్గకపోవచ్చు.అంతర్జాతీయ రాజకీయ ఉద్రిక్తతలు ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. నల్ల సముద్ర ప్రాంతంలో రవాణా, ఎగుమతులకు ఎదురవుతున్న ఆటంకాలు గోధుమలు, మొక్కజొన్న వంటి పంటల అంతర్జాతీయ వాణిజ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఫీూూ గణాంకాల ప్రకారం, 2026 సెప్టెంబరులో ప్రపంచ గోధుమ ధరలు అంతకుముందు నెలతో పోలిస్తే 6.3 శాతం పెరిగాయి. ఎగుమతి మార్గాల్లో అనిశ్చితి కారణంగా దిగుమతిదారులు ప్రత్యామ్నాయ మార్కెట్ల వైపు మళ్లడం కూడా ధరలపై ఒత్తిడిని పెంచుతోంది. హార్ముజ్ జలసంధి ద్వారా జరిగే ఇంధన, ఎరువుల రవాణాలో అంతరాయాలు ఏర్పడితే దాని ప్రభావం కూడా ప్రపంచ మార్కెట్లపై పడుతుంది. ఒక ప్రాంతంలో ఏర్పడిన యుద్ధ వాతావరణం లేదా రవాణా సమస్య మరో ప్రాంతంలోని రైతు సాగు ఖర్చును, వినియోగదారుడి సరుకుల బిల్లును ప్రభావితం చేయడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థల పరస్పర ఆధారితత్వానికి నిదర్శనం.ఎరువుల సమస్యను ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా చూడాలి. ఆధునిక వ్యవసాయంలో యూరియా, అమ్మోనియా వంటి నత్రజని ఎరువులు కీలక పాత్ర పోషిస్తున్నాయి. వీటి తయారీకి సహజ వాయువు ముఖ్యమైన ముడిసరుకు. గ్యాస్ ధరలు పెరిగినా, ఎరువుల తయారీ కేంద్రాల నుంచి సరఫరా నిలిచిపోయినా, అంతర్జాతీయ రవాణాకు ఆటంకాలు ఏర్పడినా ఎరువుల ధరలు పెరుగుతాయి. రైతులు అధిక ధరలకు ఎరువులు కొనలేకపోతే అవసరమైన సమయంలో వాటిని వినియోగించలేరు. దాని ప్రభావం వెంటనే కనిపించకపోయినా తదుపరి పంట దిగుబడిపై పడే ప్రమాదం ఉంది. అందువల్ల నేటి ఎరువుల సంక్షోభం రేపటి ఆహార సరఫరా సమస్యగా మారవచ్చు. FAO కూడా హార్ముజ్ జలసంధి ప్రాంతంలో సరఫరా అంతరాయాలు భవిష్యత్తు పంటల దిగుబడులు, ఆహార లభ్యతపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఈ సమస్యను తాత్కాలిక ధరల పెరుగుదలగా మాత్రమే చూడకుండా, దీర్ఘకాలిక వ్యవసాయ భద్రతకు సంబంధించిన అంశంగా పరిగణించాలి.అంతర్జాతీయ వాణిజ్యంలో ఎరువుల ఎగుమతులపై ఆంక్షలు, నిల్వలు పెంచుకునే ప్రయత్నాలు కూడా మార్కెట్ పరిస్థితులను సంక్లిష్టం చేస్తాయి. సరఫరా తగ్గుతుందనే భయంతో దేశాలు ముందుగానే ఎరువులను కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటే ఇతర దిగుమతిదారులకు అందుబాటులో ఉండే పరిమాణం తగ్గుతుంది. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు ఈ పరిణామాలతో ఎక్కువగా నష్టపోతాయి. వాటికి అవసరమైన ఎరువులను అధిక ధరలకు కొనుగోలు చేసే ఆర్థిక సామర్థ్యం పరిమితంగా ఉంటుంది. ప్రభుత్వాలు సబ్సిడీల ద్వారా రైతులను ఆదుకోవాల్సి వస్తుంది. కానీ అంతర్జాతీయ ధరలు దీర్ఘకాలం అధికంగా కొనసాగితే ప్రభుత్వాలపై కూడా ఆర్థిక భారం పెరుగుతుంది. ఫలితంగా రైతులకు అవసరమైన మద్దతు, వినియోగదారులకు అందుబాటు ధరల్లో ఆహారం అందించడం రెండూ సవాలుగా మారతాయి.ఇక డాలర్ విలువ, స్థానిక కరెన్సీల మారకపు విలువలు కూడా ఆహార ధరలపై ప్రభావం చూపుతాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఇంధనం, ఎరువులు, ఇతర వ్యవసాయ ముడిసరుకులను కొనుగోలు చేయడానికి అనేక దేశాలు డాలర్లను ఉపయోగిస్తాయి. రూపాయి విలువ తగ్గితే అదే పరిమాణంలో దిగుమతులు చేసుకోవడానికి ఎక్కువ రూపాయలు చెల్లించాల్సి వస్తుంది. దిగుమతిదారుల వ్యయం పెరిగినప్పుడు దాని ప్రభావం దేశీయ ధరలపై పడే అవకాశం ఉంటుంది. అయితే అంతర్జాతీయ ధరల మార్పు మొత్తం వినియోగదారుడికి ఎంతవరకు బదిలీ అవుతుందనేది దేశీయ నిల్వలు, ప్రభుత్వ విధానాలు, పన్నులు, సబ్సిడీలు, మార్కెట్ పోటీ వంటి అంశాలపై కూడా ఆధారపడి ఉంటుంది. అందువల్ల ధరల పెరుగుదలకు ఒకే కారణాన్ని చూపడం సరైంది కాదు. అంతర్జాతీయ పరిణామాలతో పాటు దేశీయ సరఫరా వ్యవస్థలోని లోపాలను కూడా పరిశీలించాలి.వాతావరణ మార్పులు ఈ సంక్షోభానికి మరో ముఖ్యమైన కోణం. ఎల్‌నినో ప్రభావం బలపడితే కొన్ని ప్రాంతాల్లో వర్షపాతం తగ్గడం, కరువు పరిస్థితులు ఏర్పడటం, సాగునీటి లభ్యత తగ్గడం వంటి పరిణామాలు చోటుచేసుకోవచ్చు. దక్షిణాసియాలో వరి వంటి పంటల దిగుబడిపై వాతావరణ మార్పుల ప్రభావం ఉండే అవకాశం ఉంది. చక్కెర ఉత్పత్తి విషయంలోనూ వర్షపాతం, ఉష్ణోగ్రతలు కీలక పాత్ర పోషిస్తాయి. 2026 సెప్టెంబరులో అంతర్జాతీయ చక్కెర ధరలు పెరగడానికి భారత్‌లో వర్షపాతంపై ఆందోళనలు, ఎల్‌నినో పరిస్థితులు సహా పలు కారణాలు ఉన్నాయని ఫీూూ పేర్కొంది. వాతావరణ మార్పులను కేవలం ప్రకృతి సమస్యగా చూడలేం. అవి రైతు ఆదాయం, ఆహార సరఫరా, మార్కెట్ ధరలు, సామాన్య కుటుంబాల జీవన వ్యయంతో నేరుగా ముడిపడి ఉన్నాయి.భారత్ విషయానికి వస్తే ఆహార ధాన్యాల ఉత్పత్తి, ప్రభుత్వ నిల్వలు కొంత రక్షణ కల్పిస్తున్నప్పటికీ, భవిష్యత్తు పంటలపై నిర్లక్ష్యం వహించడానికి వీల్లేదు. 2025--26 పంట సంవత్సరంలో దేశ ఆహార ధాన్యాల ఉత్పత్తి సుమారు 376.56 మిలియన్ టన్నులుగా అంచనా వేయగా, ఎల్‌నినో ప్రభావం, వర్షపాత లోటు వంటి ఆందోళనల నేపథ్యంలో 2026--27 సంవత్సరానికి ఉత్పత్తి లక్ష్యాన్ని 373.93 మిలియన్ టన్నులకు తగ్గించినట్లు నివేదికలు వెల్లడించాయి. అంటే దేశంలో ఆహార ధాన్యాల కొరత తక్షణమే ఏర్పడుతుందని భావించాల్సిన అవసరం లేకపోయినా, వాతావరణ పరిస్థితులు, సాగు ఖర్చులు, ఎరువుల సరఫరాపై నిరంతర నిఘా అవసరం. భారత్ కొన్ని వ్యవసాయ ఉత్పత్తుల్లో బలమైన స్థితిలో ఉన్నప్పటికీ, ఇంధనం, ఎరువుల అంతర్జాతీయ మార్కెట్లలో వచ్చే మార్పుల నుంచి పూర్తిగా వేరుపడి ఉండలేదు. దేశీయ ఉత్పత్తి బాగున్నా దిగుమతి వ్యయాలు పెరిగితే ఆహార సరఫరా గొలుసులోని ఇతర ఖర్చులు పెరిగే అవకాశం ఉంది.ఈ నేపథ్యంలో ప్రభుత్వాల బాధ్యత మరింత పెరుగుతోంది. ముందుగా ఆహార ధాన్యాల నిల్వలు, ధరలు, ఎరువుల సరఫరా, రవాణా ఖర్చులపై సమన్వయంతో కూడిన పర్యవేక్షణ ఉండాలి. అవసరమైనప్పుడు నిల్వల నుంచి సరుకులను విడుదల చేయడం, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టించే చర్యలను అరికట్టడం, మార్కెట్లో పోటీని పెంచడం వంటి చర్యలు చేపట్టాలి. రైతులకు సకాలంలో సరసమైన ధరలకు ఎరువులు అందేలా చూడాలి. పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించడం, నీటి సమర్థ వినియోగం, వాతావరణానికి అనుగుణమైన విత్తనాలు, శాస్త్రీయ సాగు పద్ధతులపై పెట్టుబడులు పెంచాలి. పంట కోత అనంతరం నష్టాలను తగ్గించేందుకు గోదాములు, శీతల నిల్వలు, రవాణా సదుపాయాలను అభివృద్ధి చేయాలి. అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో అంతరాయాలు ఏర్పడినప్పుడు ఒకే దేశం లేదా ఒకే ప్రాంతంపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ దిగుమతి మార్గాలు, సరఫరాదారులను సిద్ధంగా ఉంచుకోవాలి.అదే సమయంలో ధరల పెరుగుదల భారాన్ని రైతులపై లేదా వినియోగదారులపై మాత్రమే మోపకూడదు. రైతుకు గిట్టుబాటు ధర లభించాలి. వినియోగదారుడికి నిత్యావసరాలు అందుబాటు ధరల్లో దొరకాలి. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడం వ్యవసాయ విధానాల ప్రధాన లక్ష్యంగా ఉండాలి. ధరలు తగ్గించాలనే పేరుతో రైతుల ఆదాయాన్ని దెబ్బతీయడం ఎంత తప్పో, ఉత్పత్తి సమృద్ధిగా ఉన్నా వ్యాపార గొలుసులోని లోపాల కారణంగా సామాన్యుడిపై అధిక భారం పడే పరిస్థితిని పట్టించుకోకపోవడం కూడా అంతే తప్పు. మార్కెట్ వ్యవస్థలో పారదర్శకత, నిల్వలపై సమర్థమైన పర్యవేక్షణ, రైతు నుంచి వినియోగదారుడి వరకు మధ్యవర్తిత్వ ఖర్చుల విశ్లేషణ అవసరం.చివరగా గుర్తుంచుకోవాల్సిన విషయం ఒక్కటే. ఆహార భద్రత అంటే గోదాముల్లో ధాన్యం నింపడం మాత్రమే కాదు. రైతు పండించిన పంటకు తగిన ఆదాయం లభించడం, దేశానికి అవసరమైన ఎరువులు, ఇంధనం సకాలంలో అందుబాటులో ఉండటం, సరఫరా వ్యవస్థ నిరంతరంగా పనిచేయడం, ప్రతి కుటుంబం తన ఆదాయానికి తగిన ధరకు ఆహారాన్ని కొనుగోలు చేయగలగడం కూడా ఆహార భద్రతలో భాగమే. ప్రపంచంలో పంటలు పుష్కలంగా పండుతున్నా, సామాన్యుడి వంటగదిలో ఖర్చుల భారం తగ్గకపోతే ఆ ఉత్పత్తి సమృద్ధి ప్రజలకు పూర్తి ప్రయోజనం చేకూర్చినట్లు కాదు. అంతర్జాతీయ సంక్షోభాలను పూర్తిగా నివారించడం ఏ ఒక్క దేశానికీ సాధ్యం కాకపోవచ్చు. కానీ ముందస్తు ప్రణాళిక, సమర్థమైన నిల్వల నిర్వహణ, రైతులకు మద్దతు, సరఫరా మార్గాల వైవిధ్యం, ధరలపై నిరంతర పర్యవేక్షణ ద్వారా వాటి ప్రభావాన్ని తగ్గించవచ్చు. ఆహార ధరలు పెరిగిన తర్వాత స్పందించడం కంటే, ధరలు పెరగడానికి దారితీసే కారణాలను ముందుగానే గుర్తించి చర్యలు చేపట్టడమే సమర్థ పాలనకు నిదర్శనం. ఆకలి తీర్చే ఆహారం అందుబాటులో ఉండటమే కాదు, అది ప్రతి సామాన్యుడికి భరించగలిగే ధరలో దొరకాలి. అదే నిజమైన ఆహార భద్రతకు కొలమానం.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# మార్కెట్ యార్డులకు సౌర వెలుగులు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మార్కెట్ యార్డులకు సోలార్ వెలుగులు అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేయనున్నట్లు సమాచారం. రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులు, గోదాంల్లో దశలవారీగా సౌర విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా తొలి విడతలో వరంగల్, గద్వాల, నిజామాబాద్, సూర్యాపేట మార్కెట్లలో సోలార్ పవర్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ఇందుకోసం సుమారు రూ.1.53 కోట్ల వ్యయాన్ని అంచనా వేసినట్లు ప్రాథమిక సమాచారం. దాదాపు 289 కిలోవాట్లకు పైగా విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా అడుగులు వేస్తోంది.నిజామాబాద్‌లో 212 కిలోవాట్లు, వరంగల్‌లో 90, సూర్యాపేటలో 69, గద్వాల 10 కిలోవాట్ల చొప్పున సోలార్ ప్లాంట్లను నెలకొల్పనున్నట్లు సమాచారం. ఇక రెండో దశ(ఫేజ్-2)లో షాద్‌నగర్‌లో 64, మిర్యాలగూడలో 40, ఆదిలాబాద్‌లో 30, నకిరేకల్‌లో 24, ఖమ్మం జిల్లా మద్దులపల్లిలో 22, తుంగతుర్తిలో 2 కిలోవాట్ల చొప్పునా.. హైదరాబాద్ పరిధిలోని మలక్‌పేట, పటాన్‌చెరు, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాలతో కలిపి 21 ప్రాంతాల్లో సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది.

**విద్యుత్ బిల్లుల భారం తగ్గింపు**

ఈ ప్రణాళిక అమలైతే మార్కెట్ కమిటీలపై పడుతున్న విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుంది. పగటిపూట ఉత్పత్తి అయ్యే సౌర విద్యుత్‌ను మార్కెట్ యార్డుల్లోని కార్యాలయాలు, ఇతర విద్యుత్ అవసరాలకు వినియోగించుకోవచ్చు. మార్కెట్ యార్డుల్లో విద్యుత్ వినియోగ వ్యయం తగ్గడంతో పాటు అవసరమైన వెలుతురు, భద్రతా ఏర్పాట్లను మెరుగుపర్చేందుకు ఈ విధానం ఉపయోగపడే అవకాశం ఉంది. అయితే రాత్రివేళ, విద్యుత్ కోతల సమయంలోనూ నిరంతర సరఫరా లభించాలంటే బ్యాటరీ బ్యాకప్, గ్రిడ్ అనుసంధానం వంటి ఏర్పాట్లు ఎలా ఉంటాయన్నది నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సౌర విద్యుత్ ఉత్పత్తి, వినియోగం, నిర్వహణ ఖర్చులపై ఆధారపడి పెట్టుబడి తిరిగి వచ్చే వ్యవధి మారే చాన్స్ ఉంది.

# కాంగ్రెస్ కూటమికి గట్టి షాక్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో సుదీర్ఘ విరామం తర్వాత నిర్వహించిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల పోలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. ప్రాథమిక సరళి, అందిన సమాచారం ప్రకారం ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలోని ఎంప్లాయిస్ యూనియన్ కూటమి రాష్ట్ర స్థాయి గుర్తింపు సంఘం ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించి సంస్థపై పట్టు నిలుపుకున్నది. అయితే, ప్రభుత్వం బాహాటంగా అండదండలు అందించిన తెలంగాణ వర్కర్స్ యూనియన్‌కు కార్మికులు గట్టి షాక్ ఇవ్వడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.ఆర్టీసీ మొత్తానికి ప్రాతినిధ్యం వహించే అత్యంత కీలకమైన రాష్ట్రస్థాయి ప్రధాన గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఈయూ కూటమి స్పష్టమైన మెజార్టీ సాధించినప్పటికీ, రీజియన్లు, నాన్ ఆపరేటింగ్ యూనిట్లలో స్థానిక గుర్తింపు ఎవరికి దక్కిందనే విషయంలో పూర్తి స్పష్టత రాలేదు. ప్రాథమిక సమాచారం ప్రకారం టీఎంయూ మూడు రీజియన్లు, టీడబ్ల్యుయూ ఐదారు రీజియన్లలో స్థానిక గుర్తింపు దిశగా ఆధిక్యంలో ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నప్పటికీ, రీజియన్ల వారీగా అధికారిక వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. కాగా, ఈ ఎన్నికలకు సంబంధించిన తుది ఫలితాలను ఈ నెల 17న ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించనున్నారు.

**అధికార కాంగ్రెస్‌కు గట్టి ఎదురుదెబ్బ**

ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ.. అశ్వత్థామరెడ్డి, మొగుళ్ల రాజిరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న టీడబ్ల్యుయూకు బాహాటంగానే మద్దతు పలికింది. పార్టీ తరఫున ఎన్నికల ఇన్‌చార్జిగా మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌ను రంగంలోకి దించి విస్తృతంగా ప్రచారం నిర్వహించింది. అయితే, వెలువడుతున్న ఫలితాలు అధికార పార్టీకి శరాఘాతంగా మారాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రభుత్వం అండగా నిలిచినా కార్మికులు మాత్రం సంప్రదాయ జేఏసీ పక్షానే మొగ్గు చూపినట్లు తేటతెల్లమవుతోంది.ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న ఆధ్వర్యంలో బరిలోకి దిగిన ఎంప్లాయిస్ యూనియన్, తెలంగాణ మజ్దూర్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ల సంయుక్త కూటమి ప్రచారంలో ముందంజ వేసి కార్మికుల సంపూర్ణ విశ్వాసం చూరగొన్నది. ఎన్నికల్లో ప్రభుత్వ జోక్యం, అధికార పార్టీ అనుసరించిన వైఖరిపై నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మద్రి నరేందర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కార్మికులందరినీ సమానంగా చూడాల్సిన ప్రభుత్వం, ఒక యూనియన్‌కు బాహాటంగా కొమ్ముకాయడం ప్రజాస్వామ్య విరుద్ధమని, ప్రభుత్వం అనుసరించిన పక్షపాత వైఖరిని కార్మికులు తమ ఓటుతో తిప్పికొట్టారని ఆయన ధ్వజమెత్తారు.

# బీసీ గురుకులాల్లో వసతుల కరువు..




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బడుగు, బలహీన వర్గాల పిల్లలకు ప్రపంచ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులాల్లో వసతుల లేమి సమస్య విద్యార్థుల పాలిట శాపంగా పరిణమిస్తోంది. రాష్ట్రంలో 300 ప్రాంతాల్లో 327 గురుకులాలు ఉండగా 59 చోట్ల ప్రహరీలు లేవు. 27 పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఇప్పటికీ ఏర్పాటు చేయలేదు. 157 చోట్ల సరిపడా డైనింగ్ టేబుల్స్ లేవు. హాస్టళ్లలో రాత్రి పడుకోవడానికి మంచాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.204 గురుకులాల్లో టూ-టైర్ మంచాల కొరత ఉంది. మరో 39 చోట్ల డిజిటల్ టీవీలు అందుబాటులో లేవు. తరగతి గదుల్లో కూర్చోవడానికి కుర్చీలు, బల్లలు సరిపోక 136 చోట్ల విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. విద్యార్థినుల సంఖ్య ఎక్కువగా ఉండే గురుకులాల్లో మరుగుదొడ్ల సమస్య ఉంది. 83 ప్రాంతాల్లో టాయిలెట్ సౌకర్యాలు సరిగా లేవు. 37 ప్రాంతాల్లో ఇప్పటికీ ఆర్వో తాగునీటి ప్లాంట్లు, 91 చోట్ల ప్రత్యేక గ్రంథాలయాలు లేవు.

**అద్దె భవనాల్లోనే సమస్యలు..**

శాశ్వత భవనాల్లో గురుకులాలు నడుస్తున్న చోట పెద్దగా ఇబ్బందులు లేకున్నా.. అద్దె భవనాల్లో కొనసాగుతున్న చోట విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా టాయిలెట్లు, తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ప్రభుత్వం కొత్త భవనాల నిర్మాణం కోసం ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.500 కోట్లు కేటాయించింది. అటు అధికారులు కూడా 39 చోట్ల భవనాల నిర్మాణం కోసం స్థలాలను గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వీటిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని బీసీ గురుకుల సొసైటీ అధికారులు చెబుతున్నారు.



# రంగంలోకి 'పింక్ ఫోర్స్'

**ఢిల్లీ :** దేశ రాజధాని న్యూఢిల్లీలో సీజేపీ తలపెట్టిన భారీ నిరసన ప్రదర్శన నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. శాంతిభద్రతల పరిరక్షణ చర్యల్లో భాగంగా ఢిల్లీ పోలీసు విభాగానికి చెందిన ప్రత్యేక మహిళా విభాగం 'పింక్ ఫోర్స్'ను భారీగా రంగంలోకి దించారు. ఇటీవల రాజధానిలో జరిగిన వివిధ నిరసన కార్యక్రమాల సందర్భంగా విధుల్లో ఉన్న మహిళా పోలీసు అధికారులపై ఆందోళనకారులు దురుసుగా ప్రవర్తించడం, భౌతిక దాడులకు యత్నించిన ఘటనల నేపథ్యంలో ఉన్నతాధికారులు ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. మహిళా నిరసనకారులను నియంత్రించడంతో పాటు, బందోబస్తులో ఉండే మహిళా సిబ్బంది భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ వ్యూహాత్మక ప్రాంతాల్లో ఈ దళాలను మోహరించారు.శాంతిభద్రతల పరిరక్షణతో పాటు వివాదాలు, తప్పుడు ఆరోపణలకు చెక్ పెట్టేందుకు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది తమ యూనిఫాంలపై అధునాతన బాడీ కెమెరాలను అమర్చుకున్నారు. చీకట్లో సైతం స్పష్టంగా దృశ్యాలను రికార్డు చేసే నైట్-విజన్ సాంకేతికత ఈ కెమెరాలలో ఉందని అధికారులు తెలిపారు. నిరసనల్లో తోపులాటలు, ఘర్షణలు చోటుచేసుకున్నప్పుడు తరచూ పోలీసులపైనే ఏకపక్ష ఆరోపణలు వస్తుంటాయని, ఆ సమయంలో తాము ఎవరితోనూ తప్పుగా ప్రవర్తించలేదని నిరూపించుకోవడానికి, అలాగే సిబ్బందితో పాటు ఇతరుల రక్షణకు ఈ బాడీ కెమెరాలు తిరుగులేని ఆధారంగా పనిచేస్తాయని విధుల్లోని పోలీసు అధికారి ఒకరు స్పష్టం చేశారు. ప్రతీ కదలికను ఆడియో, వీడియో రూపంలో రికార్డు చేస్తూ పోలీసులు పటిష్ట నిఘా కొనసాగిస్తున్నారు. ఇదిలా ఉంటే వివిధ మార్గాల్లో జంతర్ మంతర్ చేరుకునేందుకు ప్రయత్నించిన దాదాపు 150 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు.

# అంగడిపేట ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం




**నల్లగొండ జిల్లా / చింతపల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** దేవరకొండ నియోజకవర్గం పీఏ పల్లి మండలం అంగడిపేట స్టేజ్ సమీపంలో అంగడిపేట యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగడిపేట ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను బీఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ ప్రారంభించారు.ఈ సందర్భంగా యువత క్రీడల్లో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని, క్రీడలు యువతలో ఐక్యత, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రామావత్ చిరంజీవి, మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, పెద్దిశెట్టి సత్యం, రామకృష్ణ, అమృ నాయక్, పాండు నాయక్, రజినీకాంత్, జాగ్రూ బావోజీ, విజయ్ నాయక్, ఘనపురం శంకర్, వెంకటయ్య, బాలు, కొండపల్లి శ్రీను, కొండలు, మురళి, జవహర్ లాల్ నాయక్, చింటూ నాయక్, కోటేష్ తదితరులు, టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# 170 రైళ్లు రద్దు.. 9 రైళ్ల రూట్లలో మార్పులు..

**ఢిల్లీ :** రైల్వే ప్రయాణికులకు అలర్ట్.. ఢిల్లీ - ఎన్‌సీఆర్ పరిధిలో రైళ్లలో ప్రయాణించే వారికి కీలక సమాచారం. అక్టోబర్ 10న అంటే ఈ రోజు.. ఢిల్లీ ప్రాంతంలో ప్రతిపాదించిన నిరసన కార్యక్రమం నేపథ్యంలో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడనుంది.. ఉదయం 4 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ పరిస్థితి ఉండే అవకాశం ఉంది.. మొత్తం 170 రైళ్లను రద్దు చేయగా, మరో తొమ్మిది రైళ్ల ప్రారంభ లేదా చివరి స్టేషన్లలో మార్పులు చేశారు.. దీంతో నిత్యం ఉద్యోగాలు, చదువులు, ఇతర పనుల కోసం రైళ్లలో ప్రయాణించే వేలాది మంది ప్రయాణికులు తమ ప్రయాణ ప్రణాళికలను మార్చుకోవాల్సి రావచ్చు.

**ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలోని ప్రయాణికులపై ప్రభావం**

రద్దయిన రైళ్లలో ఢిల్లీ, న్యూఢిల్లీ, ఘజియాబాద్, పల్వాల్, పానిపట్, కురుక్షేత్ర, అలీగఢ్, సహారన్‌పూర్, రోహ్‌తక్, రేవారి, మొరాదాబాద్ తదితర ప్రాంతాల మధ్య నడిచే ప్యాసింజర్ రైళ్లు ఉన్నాయి.. ఢిల్లీ-ఘజియాబాద్, న్యూఢిల్లీ-ఘజియాబాద్, ఢిల్లీ-పానిపట్, ఢిల్లీ-పల్వాల్, ఢిల్లీ-అలీగఢ్ మార్గాల్లో రాకపోకలు సాగించే రైళ్లపై ప్రధానంగా ప్రభావం పడనుంది. అలాగే ఢిల్లీ నుంచి సహారన్‌పూర్, షామ్లీ, రేవారి, రోహ్‌తక్, కురుక్షేత్ర ప్రాంతాలకు వెళ్లే రైళ్లలోనూ మార్పులు ఉండనున్నట్లు సమాచారం. ఘజియాబాద్, న్యూఢిల్లీ, ఢిల్లీ జంక్షన్ మధ్య నడిచే అనేక లోకల్ రైళ్లు కూడా రద్దయిన జాబితాలో ఉన్నాయి. ఢిల్లీ నుంచి మధుర, తుండ్లా, బులంద్‌షహర్, ఖుర్జా ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు సైతం తమ రైళ్ల ప్రస్తుత స్థితిని ముందుగానే తెలుసుకోవాలి.

**తొమ్మిది రైళ్ల ప్రారంభ, చివరి స్టేషన్లలో మార్పులు**

మొత్తం తొమ్మిది రైళ్లను పూర్తిగా రద్దు చేయకుండా వాటి రాకపోకలను సవరించారు అధికారులు.. వీటిలో ఐదు రైళ్లను ఘజియాబాద్ నుంచి ప్రారంభించేలా మార్పులు చేయగా, మరో నాలుగు రైళ్లను ఢిల్లీ లేదా న్యూఢిల్లీలోని నిర్ణీత చివరి స్టేషన్‌కు బదులుగా ఘజియాబాద్ వరకే నడిపే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఢిల్లీ-అలీగఢ్, న్యూఢిల్లీ-అలీగఢ్, ఢిల్లీ-ఖుర్జా, ఢిల్లీ--దంకోర్ మార్గాలకు సంబంధించిన రైళ్లు ఈ మార్పుల పరిధిలో ఉన్నట్లు జాబితా సూచిస్తోంది. అలీగఢ్ నుంచి ఢిల్లీ లేదా న్యూఢిల్లీకి వచ్చే కొన్ని రైళ్లు ఘజియాబాద్ వరకే పరిమితం కానున్నట్లు సమాచారం. దీంతో ఢిల్లీకి వెళ్లాలనుకునే ప్రయాణికులు ఘజియాబాద్‌లో దిగి ప్రత్యామ్నాయ రైలు లేదా ఇతర రవాణా మార్గాలను ఎంచుకోవాల్సి రావచ్చు.

**ప్రయాణానికి ముందు రైలు స్థితిని ఎలా తనిఖీ చేయాలి?**

రైల్వే ప్రయాణికులు స్టేషన్‌కు బయలుదేరే ముందే తమ రైలు రద్దయిందా, సమయం మారిందా, ప్రారంభ లేదా చివరి స్టేషన్‌లో మార్పు జరిగిందా అనే వివరాలను తనిఖీ చేసుకోవాలి. ఇందుకోసం నేషనల్ ట్రైన్ ఎంక్వైరీ సిస్టమ్ (ఎన్‌టీఈఎస్)ను ఉపయోగించుకోవచ్చు. అలాగే రైల్వే హెల్ప్‌లైన్ నంబర్ 139 ద్వారా వివరాలు తెలుసుకోవచ్చు. ముఖ్యంగా ఢిల్లీ, ఘజియాబాద్, నోయిడా, పల్వాల్, పానిపట్ తదితర ప్రాంతాల మధ్య ప్రయాణించే వారు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. రైలు రద్దు లేదా మార్గంలో మార్పుల కారణంగా ప్రయాణంలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ రవాణా ఏర్పాట్లు చేసుకోవడం మంచిది.

# ఢిల్లీని పాకిస్తాన్‌కు అప్పగించారా?



**ఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై సీపీఐ నేత నారాయణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ సోషల్ మీడియా వేదికగా నారాయణ వీడియో విడుదల చేశారు. ఢిల్లీని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా దిగ్బంధించిందని, అసలు ఢిల్లీని పాకిస్థాన్‌కు ఏమైనా అప్పగించారా అనే అనుమానం కలుగుతోందని ఆయన విమర్శించారు. సుమారు 50 వేల నుండి 75 వేల మంది పోలీసులను, ఇతర భద్రతా బలగాలను మోహరించి సాధారణ ప్రజల జీవనాన్ని స్తంభింపజేశారని మండిపడ్డారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వచ్చిన వారిని అణచివేసేందుకు ఈ స్థాయిలో పోలీసు బలగాలను దించడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 'ముందు గొయ్యి.. వెనుక నూయి' అన్న చందంగా తయారైందని నారాయణ ఎద్దేవా చేశారు. చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నిస్తే ప్రభుత్వం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. న్యాయకోవిదులు, సుప్రీంకోర్టు కూడా దీనిపై స్పందిస్తున్న తరుణంలో ప్రభుత్వం తన వైఖరిని పునరాలోచించుకోవాలని సూచించారు.

**బీజేపీ మీడియా సృష్టి..**

అలాగే, కొన్ని మీడియా సంస్థలు ఇష్టారాజ్యంగా ప్రచారం చేస్తున్నాయని, అదంతా బీజేపీ మీడియా సృష్టి తప్ప మరేమీ కాదని ఆయన కొట్టిపారేశారు. నిర్బంధ విధానాలు, అణచివేత చర్యల ద్వారా ప్రజా ఉద్యమాలను ఎప్పటికీ ఆపలేరని, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా తన తప్పులను సరిదిద్దుకోవాలని డిమాండ్ చేశారు.

**విభజన రాజకీయాలకు సమాధానం..**

తెలంగాణ ఆర్టీసీ కార్మిక సంఘ గుర్తింపు ఎన్నికల్లో ఏఐటీయూసీ అనుబంధ ఎంప్లాయీస్ యూనియన్ విజయం సాధించడం పట్ల సీపీఐ జాతీయ నేత నారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయానికి కృషి చేసిన కార్మికులందరికీ ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. కార్మిక సంఘ ఎన్నికలు వాస్తవానికి రాజకీయాలకు అతీతంగా జరగాల్సి ఉండగా, అధికార గర్వంతో కాంగ్రెస్ పార్టీ "కమ్యూనిస్టులను ఓడించండి" అని పిలుపునిచ్చిందని నారాయణ విమర్శించారు. ఈ ఎన్నికలను కాంగ్రెస్--కమ్యూనిస్టుల మధ్య రాజకీయ పోరుగా మార్చింది కాంగ్రెస్ పార్టీనే అని, దీనికి పూర్తి బాధ్యత ఆ పార్టీదేనని స్పష్టం చేశారు. ఎంప్లాయీస్ యూనియన్‌తో పాటు ఐక్యంగా నిలిచి గెలుపునకు బాటలు వేసిన మిత్ర కార్మిక సంఘాలన్నింటికీ ఆయన అభినందనలు తెలిపారు. ఈ ఐక్యత భవిష్యత్తులోనూ ఇలాగే కొనసాగి, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం జరిగే పోరాటాలను మరింత బలోపేతం చేయాలని నారాయణ ఆకాంక్షించారు.

# కన్నాట్ ప్లేస్‌లో హైటెన్షన్..



**ఢిల్లీ :** ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ ప్రాంతంలో శనివారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. పీటీఐ బిల్డింగ్ సమీపంలో ఆందోళన చేపట్టిన సుమారు 50 మంది నిరసనకారులు ఒక్కసారిగా పోలీసులపైకి రాళ్లు రువ్వడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ ఊహించని పరిణామంలో ఇద్దరు పోలీసులకు గాయాలయ్యాయి. ఈ ఘటనపై అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి ఆందోళనకారులందరినీ అదుపులోకి తీసుకున్నారు. ఈ నిరసన ప్రదర్శనలో రాకేష్ తికాయత్ వర్గానికి చెందిన కిసాన్ నేతలు కూడా ఉన్నట్లు గుర్తించారు. వారిని అక్కడి నుంచి తరలించడానికి ప్రత్యేకంగా జైలు వ్యాన్ల లాంటి వాహనాలను రంగంలోకి దించారు. కొందరు యువకులు పోలీసులతో వాగ్వాదానికి దిగుతూ, కిందపడి లాగుతున్న దృశ్యాలు కనిపించాయి. కన్నాట్ ప్లేస్ సెంట్రల్ పార్క్ వైపు దూసుకెళ్లిన ఆందోళనకారులను నిలువరించేందుకు భారీగా పారామిలటరీ బలగాలను కూడా మోహరించారు.గోల్ డాక్ ఖానా ప్రాంతంలో పోలీసులు, భద్రతా బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారంపై న్యూఢిల్లీ డీసీపీ సచిన్ శర్మ మాట్లాడుతూ.. ఇది కేవలం ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా తీసుకున్న ప్రివెంటివ్ యాక్షన్ అని స్పష్టం చేశారు. శాంతిభద్రతలను కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని చెబుతూ, ప్రజలందరూ సంయమనం పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అయితే ఈ ఆందోళనకు అసలు కారణం ఏమిటి, రాళ్లు విసరడానికి దారితీసిన పరిస్థితులు ఏంటనే దానిపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.మరోవైపు.. రాజధానిలో సీజేపీ నిరసనలు కొనసాగుతున్నాయి. 'కాక్రోచ్ జనతా పార్టీ' వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కేను పోలీసులు అదుపులోకి తీసుకున్న తర్వాత ఆయనకు సంబంధించిన ఒక ప్రీ-రికార్డెడ్ వీడియో మెసేజ్ బయటకు వచ్చింది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ తలపెట్టిన నిరసన ప్రదర్శన నేపథ్యంలో ఈ వీడియో వెలుగులోకి రావడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ వీడియోలో అభిజీత్ మాట్లాడుతూ.. "మీరు ఈ వీడియో చూస్తున్నారంటే, నాతో పాటు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్‌లను పోలీసులు అరెస్టు చేశారని అర్థం. ఇలాంటి పరిస్థితుల్లో ఇకపై ఈ ఉద్యమానికి అజింక్యా షిండే నాయకత్వం వహిస్తారు" అని స్పష్టం చేశారు.

# నాగసముద్రాల మోడల్ స్కూల్ అభివృద్ధి నిధుల్లో గోల్‌మాల్?



**కోహెడ,ఫ్లాష్ ఇండియా :** పీఎం శ్రీ పథకం ద్వారా మండలంలోని నాగసముద్రాల మోడల్ స్కూల్ కు 2023 లో సుమారు రూ.2.కోట్లు స్కూల్ అభివృద్ధికి ఖర్చు చేయాలని నిధులు విడుదల అయ్యాయి.పేరెన్స్ మీటింగ్ జరిగితే సింగిల్ టి ఇవ్వకుండా లెక్కల్లో మాత్రం వేలకొద్ది ఖర్చుచేసినట్టు లెక్కలు ఉన్నాయి.టూర్ కెళ్ళింది ఒక బస్సు అయితే ఎనిమిది బస్సుల లెక్కలు ఉన్నట్టు అనుమానాలు? నిధుల లెక్కలు అడుగుతే చెప్పకుండా తప్పించుకుంటూ గోప్యత పాటిస్తున్నారు. ఆర్టీఐ చట్టం లో గుగులోతు శేఖర్ నాయక్ అడిగినా సమాధానం ఇవ్వడం లేదు. తెలంగాణ మోడల్ స్కూల్‌లో లెక్కల్లో అవకతవకలను, తల్లిదండ్రుల సమావేశాల ఖర్చులు, బిల్డింగ్ పెయింటింగ్ ఖర్చులు, రికార్డుల అప్పగింతపై సమగ్ర విచారణ చేపట్టాలి అని బీజేపీ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వేంకటేశం డిమాండ్ చేశారు.ఈ విషయంపై 26-09-2026న సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారి మొదటి అప్పీల్ చేసినప్పటికీ ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. ప్రిన్సిపాల్ రవీందర్ వివరణ కోరగా నేను 2014లో వచ్చాను నాకు ఎలాంటి సంబంధం లేదు అప్పటి ప్రిన్సిపాల్ నరసింహులను ఎన్నిసార్లు అడిగినా కూడా లెక్కలు ఇవ్వడం లేదు అని అన్నారు. దీనిమీద డీఈఓ కు కంప్లీట్ చేశానని అన్నారు.

# తెలంగాణలో ఏకైక వీరబ్రహ్మేంద్ర స్వామి మఠాన్ని అభివృద్ధి చేయాలి!

**పుణ్యక్షేత్ర ప్రాంగణంలో సజీవ సాక్ష్యంగా నిలిచిన శరబాక లింగమయ్య 'సజీవ సమాధి'**

**చారిత్రక ఆధ్యాత్మిక నిలయం సమగ్ర అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలి**

**కనీస వసతులు, నిధుల మంజూరుకై మఠాధిపతి శివకుమార్ స్వామి, రేగోడ్ గ్రామస్తుల వేడుకోలు**





**మెదక్ జిల్లా / రేగోడు ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** సమగ్ర తెలంగాణ రాష్ట్రంలోనే మరెక్కడా లేని విధంగా, అత్యంత మహిమాన్వితమైన ఏకైక శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం ప్రసాద సమాధి క్షేత్రంగా రేగోడ్ మండల కేంద్రంలోని పుణ్యధామం విరాజిల్లుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాలో ఉన్న ప్రధాన కందిమల్లయ్యపల్లె బ్రహ్మంగారి మఠం తర్వాత, భక్తులు అంతటి భక్తిశ్రద్ధలతో కొలిచే ఏకైక విశిష్ట ఆధ్యాత్మిక నిలయం కావడంతో దీనిని లి"తెలంగాణలోనే రెండో కందిమల్లయ్యపల్లె"లిగా పిలుచుకుంటారు. ఇంతటి చారిత్రక ప్రాధాన్యం, అరుదైన ప్రసాద సమాధి ఉన్న ఈ పుణ్యధామం మరింతగా ప్రగతి పథంలో పయనించేలా, మఠాన్ని తక్షణమే సమగ్రంగా అభివృద్ధి చేయాలని గ్రామ వాసులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

**సజీవ సాక్ష్యంగా నిలిచిన శరబాక లింగమయ్య 'సజీవ సమాధి'**

ఈ పరమ పవిత్ర క్షేత్రానికి ముఖ్యాధారమైన శరబాక లింగమయ్య గారు దైవ చింతనతో ఈ మఠం ప్రాంగణంలోనే 'సజీవ సమాధి' అయ్యారు. తెలంగాణ మొత్తం మీద మరెక్కడా లేని విధంగా, శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ప్రసాద సమాధి కలిగిన పరమ పవిత్ర పుణ్యధామం ఇది కావడం విశేషం. ఈ సమాధి క్షేత్రం సాక్ష్యంగానే నాటి నుంచి నేటి వరకు ఏటా ఇక్కడ ఉత్సవాలు అత్యంత నిష్ఠతో, వైభవంగా నిర్వహిస్తున్నారు. వీరబ్రహ్మేంద్రస్వామి అవతరించిన కార్తిక శుక్ల ద్వాదశి నాడు ప్రత్యేక పూజలు జరుపుతారు. ఈ వేడుకలో భక్తులు వేలాదిగా పాల్గొంటారు. చుట్టుపక్కల గ్రామాల రైతుల ఎడ్లబండ్ల ప్రదర్శన ఉంటుంది. ఏటా వైశాఖ శుద్ధ పంచమి మొదలు ఆరు రోజులు జాతర చేస్తారు. అన్ని రోజులూ ఆరు బయలు నాటకాలు ప్రదర్శిస్తారు. ఈ క్షేత్ర సంప్రదాయానికి ఇవి అద్దం పడతాయి.

**శతాబ్దాల నాటి మహోజ్వల చరిత్ర**

శతాబ్దాల కిందటే రేగోడులో బ్రహ్మంగారి మఠం వెలిసింది. అప్పట్లో ఈ ప్రాంతంలో శరబాక లింగమయ్య అనే వ్యక్తి నాటువైద్యం చేస్తూ ఉండేవాడు. ఆ సమయంలో రేగోడు ప్రాంతంలో కలరా మహమ్మారిలా ప్రబలి ఎందరో ప్రాణాలు కోల్పోయారు. లింగమయ్య ఎంత ప్రయత్నం చేసినా కలరా తగ్గలేదు. దీంతో ఆయన కడప జిల్లాలోని కందిమల్లయ్యపల్లెలోని బ్రహ్మంగారి మఠానికి వెళ్లాడు. అక్కడి మఠాధిపతి ఆజ్ఞానుసారం రేగోడుకు తిరిగి వచ్చి ఇక్కడ మఠం నెలకొల్పాడు. ఆ తర్వాతే, కలరా తీవ్రత పూర్తిగా తగ్గిందని స్థానికులు చెబుతారు. ఆ స్వామివారి మహిమ వల్లే తమ పూర్వీకులు ప్రాణాలతో నిలిచారని స్థానికులు ఇప్పటికీ ప్రగాఢంగా నమ్ముతారు.

**మఠం సమగ్ర అభివృద్ధికి కావాల్సిన ప్రధాన అవసరాలు:**

మఠం యొక్క సర్వతోముఖాభివృద్ధిపై మఠాధిపతి శివకుమార్ స్వామితో పాటు స్థానిక భక్తులు, రేగోడ్ గ్రామ వాసులు స్పందిస్తూ.. ప్రభుత్వం, దేవాదాయ శాఖ తక్షణమే చొరవ చూపి ప్రత్యేక నిధులు మంజూరు చేసి, కింది వసతులను కల్పించాలని కోరుతున్నారు:

**భక్త నివాస సముదాయాలు (ఛత్రాలు):** సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులు రాత్రి వేళల్లో బస చేయడానికి మరియు విశ్రాంతి తీసుకోవడానికి ఎలాంటి వసతి గృహాలు లేవు. తక్షణమే ఆధునిక వసతి గృహాలను నిర్మించాలి.

కల్యాణ మండపం ఉ నిత్య అన్నదాన శాల: నిత్యం వచ్చే భక్తులకు అన్నదానం సాగేలా ఆధునిక వంటశాల, భక్తుల సౌకర్యార్థం ఒక పెద్ద కల్యాణ మండపం అవసరం ఎంతైనా ఉంది.

**మౌలిక వసతుల కల్పన:** క్షేత్రానికి వచ్చే భక్తుల కొరకు శాశ్వత తాగునీటి వసతి ఏర్పాటు చేయడంతో పాటు, పండగ దినాల్లో ఇబ్బందులు కలగకుండా పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.

**ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతంగా గుర్తింపు:** ఈ చారిత్రక క్షేత్రాన్ని తెలంగాణ పర్యాటక శాఖ గుర్తించి, ప్రత్యేక పర్యాటక వలయ కింద నిధులు కేటాయించి ప్రగతి పథంలో నడిపించాలి.

తెలంగాణలోనే అరుదైన ఈ క్షేత్రాన్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ చూపి రేగోడ్ బ్రహ్మంగారి మఠాన్ని ఆదర్శవంతమైన కేంద్రంగా మార్చేలా అభివృద్ధి పనులు చేపట్టాలని మఠాధిపతి శివకుమార్ , భక్తులు రేగోడ్ గ్రామ వాసులందరూ ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు.

# నమ్మకానికి మారుపేరు – కోమటిరెడ్డి బ్రదర్స్

**కోమటిరెడ్డి బ్రదర్స్ వెంటే నా తుది శ్వాస వరకు ప్రయాణం : గట్టిగుండ్ల రవి**





**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** విధేయతకు, నమ్మకానికి, అంకితభావానికి నిలువెత్తు నిదర్శనం కోమటిరెడ్డి బ్రదర్ గట్టిగుండ్ల రవి. తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నివాసంలో రవి జన్మదిన వేడుకలు అత్యంత ఘనంగా, కోలాహలంగా జరిగాయి.మంత్రి కోమటిరెడ్డి స్వయంగా రవి కి , కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.గట్టిగుండ్ల రవి నా ప్రియ శిష్యుడు. 1999 నుండి నేటి వరకు.. అంటే గత 26 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ జెండాను భుజాన మోస్తూ, పార్టీ కష్టాల్లో, సుఖాల్లో అండగా నిలిచిన నిజమైన నాయకుడు రవి. ఇలాంటి కార్యకర్తలు ఉండటం కాంగ్రెస్ పార్టీ అదృష్టం అని ప్రశంసల జల్లు కురిపించారు.అనంతరం రవి కి ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు .తన జన్మదిన వేడుకకు హాజరైన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతూ గట్టిగుండ్ల రవి చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది.రవి మాట్లాడుతూ.ఈ రోజు నా జన్మదినం. ఈ శుభ సందర్భంగా నా జీవితాన్ని, నా సర్వస్వాన్ని కోమటిరెడ్డి బ్రదర్స్ కు అంకితం చేస్తున్నాను. నా ఒంట్లో తుది శ్వాస ఉన్నంత వరకు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెంట, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వెంట నడుస్తాను. వారు వేసే ప్రతి అడుగులో, వారు చేసే ప్రతి ప్రజా సేవా కార్యక్రమంలో నేనే ముందుంటాను. ఇదే నా జీవిత లక్ష్యం" అని స్పష్టం చేశారు.ఈ వేడుకల్లో తెలంగాణ ఉద్యమకారుడు గట్టిగుండ్ల రాజ్ కుమార్, తెలంగాణ స్టూడెంట్ ఎడ్యుకేషన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గూడపూరి సంజయ్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పుల్లెంల సందీప్, స్టూడెంట్ ఎడ్యుకేషన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు కొండ మహేష్, నల్గొండ జిల్లా నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

# గరీబ్‌పేటలో పోలీసుల మెరుపు తనిఖీలు.. 30 మద్యం సీసాలు స్వాధీనం



**కొత్తగూడెం సింగరేణి,ఫ్లాష్ ఇండియా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం గరీబ్‌పేటలో శనివారం తెల్లవారుజామున డీఎస్పీ ఆదినారాయణ పర్యవేక్షణలో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 68 ద్విచక్ర, 19 త్రిచక్ర వాహనాలు సహా 87 వాహనాలపై జరిమానాలు విధించారు. 30 ఐఎంఎఫ్ఎల్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి, మాదకద్రవ్యాలు, జూదం, మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ సూచించారు. సైబర్ మోసాలకు గురైతే 1930కు ఫిర్యాదు చేయాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. ఈ తనిఖీల్లో సీఐలు, పోలీసు అధికారులు, సుమారు 120 మంది సిబ్బంది పాల్గొన్నారు.



## శ్రీ శ్రీ శ్రీ దుర్గామాత అమ్మవారి మాలధారణ ప్రత్యేక పూజలు

**వికారాబాద్ జిల్లా/ చౌడాపూర్ మండల, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** శ్రీ శ్రీ శ్రీ అంబత్రేయ క్షేత్రం ఆలయంలో భక్తిశ్రద్ధలతో శ్రీ శ్రీ శ్రీ దుర్గామాత అమ్మవారి మాలధారణ చేసి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు కలగాలని, లోకమంతా సుభిక్షంగా ఉండాలని ప్రార్థించడం జరిగింది. కార్యక్రమంలో మక్త వెంకటాపూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటయ్య, బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా నాయకులు రమేష్ నాయక్, తదితరులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొని మాలాధారణ వేసుకోవడం జరిగింది.



## పితృ అమావాస్య సందర్భంగా వాసవి కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో

**సూర్యాపేట,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** వాసవి కపుల్స్ క్లబ్ ప్రెసిడెంట్ బుద్ధా శ్రావణ్ కుమార్ గుప్తా మరియు శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో గత మూడు సంవత్సరాలుగా కొత్త బస్టాండ్ దగ్గర ఫ్లై ఓవర్ కింద వారి తండ్రిగారైన బుద్ధా మంగయ్య గారి జ్ఞాపకార్థం ప్రతినెల అమావాస్య రోజున 200 మందికి పైగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు ఈ కార్యక్రమంలో ఐపిసిలు పబ్బతి వేణుమాధవ్ మాట్లాడుతూ వీరి యొక్క సేవలను కొనియాడారు,ఈ కార్యక్రమంలోబిక్కుమల్లక్రిష్ణ,రాచకొండ శ్రీనివాస్, ఆర్ సి జూలకంటి నాగరాజ్, జెడ్ సి బుద్ధ భానుతేజ, నోముల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## కొబ్బరి బొండాల కోసం ఏకంగా చెట్టునే కోసేశారు..



**కొత్తగూడెం సింగరేణి,ఫ్లాష్ ఇండియా :** కొబ్బరి బొండాల కోసం కొబ్బరి చెట్టును మిషన్‌తో కోస్తున్న వ్యక్తిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఘటన రుద్రంపూర్ పంచాయతీ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చుంచుపల్లి మండలం చుంచుపల్లి తండాకు చెందిన సంతోష్ రుద్రంపూర్ పంచాయతీ పరిధిలోని ఫిల్టర్ బెడ్ వద్ద ఉన్న కొబ్బరి చెట్టును కొబ్బరి బోండాల కోసం మిషన్‌తో కోస్తుండగా స్థానికులు గమనించి అడ్డుకున్నారు. అనంతరం డయల్ 112కు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న పోలీసులకు అతడిని అప్పగించారు.ఫిల్టర్ బెడ్ పరిసరాల్లో గతంలోనూ కొబ్బరి బోండాల కోసం పలుమార్లు చెట్లు నరికివేసినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ఘటనలపై పర్యావరణ ప్రేమికులు గతంలోనే పోలీసులకు ఫిర్యాదు చేసి, చెట్లను నరికే వారిపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ప్రకృతి పరిరక్షణకు కీలకమైన చెట్లను స్వార్థ ప్రయోజనాల కోసం నరికివేయడం పై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే యాసిన్ ఈ ఘటనపై దృష్టి సారించి, చెట్ల నరికివేతకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## అన్నదాతకు అండగా నిలవాలి..
# సాగునీరు అందించాలి!

- ఎలిగేడు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ ధర్నా
- ఎస్సారెస్పీ కాల్వలకు నీటి విడుదలపై డిమాండ్
- విద్యుత్ కోతలతో పంటలకు నష్టం జరుగుతోందన్న కొప్పుల ఈశ్వర్



**ఎలిగేడు, పెద్దపల్లి జిల్లా,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** సాగునీరు, విద్యుత్ సమస్యలతో రైతులు పడుతున్న ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు రైతులతో కలిసి ఎలిగేడు మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఎస్సారెస్పీ కాల్వలకు నీటిని విడుదల చేయాలని, వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోర-ుతూ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. పంటల సాగు కోసం రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టారని, పంటలు చేతికొచ్చే సమయంలో సాగునీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాల్వలకు నీరు విడుదల చేయకపోవడంతో పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడటం వల్ల బోరు మోటార్ల ద్వారా పంటలకు నీరందించడం కష్టంగా మారిందన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని పేర్కొంటూ, ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు నిరంతర విద్యుత్ ఎందుకు అందడం లేదని ప్రశ్నించారు. అధికారులు విద్యుత్ సరఫరా సక్రమంగా ఉందని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో తరచూ కోతలు ఎదురవుతున్నాయని విమర్శించారు. సబ్‌స్టేషన్ వద్ద నిరసన జరుగుతున్న సమ-యంలోనూ రెండుసార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని తెలిపారు.వారం రోజుల్లోగా ఎస్సారెస్పీ కాల్వలకు సాగునీటిని విడుదల చేయాలని, విద్యుత్ కోతలను నిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లు, కాలిపోయిన మోటార్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. రైతు భరోసా నిధుల విడుదల, పంట బీమా, యూరియా సరఫరా, పంటల కొనుగోళ్లపై రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలని అన్నారు. పంట నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ.. విద్యుత్ కోతల కారణంగా రైతులు డీజిల్ జనరేటర్లతో మోటార్లు నడిపించుకుంటూ అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందన్నారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు సాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.పెద్దపల్లి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి మాట్లాడుతూ.. పంటలు ఎండిపోకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, ఎస్సారెస్పీ కాల్వలకు నీరు విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని అన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, పెట్టుబడి సాయం అందించడంతో పాటు పంటల కొనుగోలు సమస్యలను పరిష్కరించాలని కోరారు.మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ మాట్లాడుతూ.. సాగునీరు, విద్యుత్ సమస్యల పరిష్కారంలో అధికారులు జాప్యం చేయకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతులకు నష్టం కలగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి--మోహన్ రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, సుల్తాన్‌పూర్ సర్పంచ్ బాపయ్య, ఉపసర్పంచ్ రమేష్ రావు, బద్దం తిరుపతిరెడ్డి, పోషాలు, రాజేశం, వినోద్, సంపత్, నారాయణ, సాయినాథ్, సది, కార్తీక్, టేట్ కుమార్ తదితర నాయకులు, రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఐలాపురం,తోపుచెర్ల గ్రామాల చెరువులను నింపేందుకు ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ ప్రత్యేక చొరవ



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** సాగర్ ఎడమ కాలువ ద్వారా తాగునీటిని విడుదల చేసిన నేపథ్యంలో మిర్యాలగూడ నియోజకవర్గంలోని లాపురం,తోపుచెర్ల గ్రామాల చెరువులను డి-30 కాలువ ద్వారా నింపేందుకు ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు.ఈ సందర్భంగా రైతులతో కలిసి కాలువ వద్దకు వెళ్లి, సంబంధిత అధికారులతో మాట్లాడి గ్రామాల చెరువులకు నీటిని విడుదల చేసి నింపేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో పర్యటిస్తూ రైతుల సమస్యలను తెలుసుకుని, గ్రామాల తాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు చెరువుల్లో నీరు నిల్వ ఉండేలా కృషి చేశారు.రైతులకు, గ్రామ ప్రజలకు నీటి కొరత తలెత్తకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి చెరువులను నింపాలని ఎమ్మెల్సీ సూచించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైతుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సూర్య,స్థానిక రైతులు , గ్రామస్తులు,కాంగ్రెస్ నాయకులు,ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## డాక్టర్ కాసం వెంకటేశ్వర్లుకు ఆత్మీయ సమ్మేళనంలో ఘన సన్మానం

**నల్లగొండ జిల్లా / చింతపల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** నల్లగొండ జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో డాక్టర్ కాసం వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ కన్వీనర్ నక్క వెంకటేష్ యాదవ్, నేతల వెంకటేష్ యాదవ్, వరికుపల్లి వెంకటయ్య, బొడ్డు యాదగిరి, ఎమ్మెల్సీ ఎన్-రోల్‌మెంట్ మండల కన్వీనర్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా నాయకులు పరస్పరం ఆత్మీయంగా పలకరించుకుంటూ, పార్టీ నాయకుల మధ్య సమన్వయం, సత్సంబంధాల బలోపేతంపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.



# సీఎస్కేలో ఏం జరుగుతోంది..

ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందే చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)లో కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. జట్టు ప్రక్షాళనలో భాగంగా ఇప్పటికే హెడ్ కోచ్‌గా జహీర్ ఖాన్‌ను నియమించిన సీఎస్‌కే యాజమాన్యం.. తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. జట్టు బ్యాటింగ్ కోచ్‌గా సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ మైఖేల్ హస్సీతో సీఎస్‌కే విడిపోయినట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో చెన్నై జట్టు సహాయక సిబ్బందిలో మార్పుల వ్యవహారం క్రికెట్ వర్గాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది.క్రిక్‌బజ్ కథనం ప్రకారం.. మైఖేల్ హస్సీని తమ నిర్ణయం గురించి సీఎస్‌కే యాజమాన్యం అధికారికంగా సమాచారం అందించింది. ఐపీఎల్ 2027లో హస్సీ మరో ఫ్రాంచైజీ తరఫున కోచింగ్ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే కొన్ని జట్లతో ఆయన చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. దీనిపై హస్సీ నుంచి గానీ, సంబంధిత ఫ్రాంచైజీల నుంచి గానీ అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. సీఎస్‌కేలో ఇప్పటికే కోచింగ్ విభాగానికి సంబంధించి పలు మార్పులు చోటుచేసుకున్నాయి. 18 ఏళ్ల పాటు జట్టుకు హెడ్ కోచ్‌గా సేవలందించిన స్టీఫెన్ ఫ్లెమింగ్‌తో ఆ ఫ్రాంచైజీ విడిపోయింది. బౌలింగ్ కోచ్ ఎరిక్ సిమన్స్ కూడా జట్టును వీడినట్లు సమాచారం. అలాగే ఫీల్డింగ్ కోచ్ జేమ్స్ ఫోస్టర్ భవిష్యత్తు కూడా ప్రస్తుతం అనిశ్చితిలో ఉన్నట్లు తెలుస్తోంది.ఇటీవలే జహీర్ ఖాన్‌ను హెడ్ కోచ్‌గా నియమించిన సీఎస్‌కే.. మాజీ పేసర్ మోహిత్ శర్మకు బౌలింగ్ కోచ్ బాధ్యతలు అప్పగించింది. ఇప్పుడు మైఖేల్ హస్సీ కూడా జట్టును వీడటంతో కొత్త బ్యాటింగ్ కోచ్ ఎవరనే ఆసక్తి నెలకొంది. ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటిగా పేరున్న సీఎస్‌కే.. కొత్త కోచింగ్ బృందంతో వచ్చే సీజన్‌కు ఎలా సిద్ధమవుతుందో చూడాలి. హస్సీకి సీఎస్కేతో 15 ఏళ్లకు పైగా అనుబంధం ఉంది. ఆటగాడిగా, కోచ్‌గా జట్టు విజయాల్లో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆటగాడిగా రెండు ఐపీఎల్ టైటిళ్లు గెలిచిన హస్సీ.. కోచ్‌గా మరో మూడు టైటిళ్ల విజయాల్లో భాగమయ్యారు. ముఖ్యంగా బ్యాటర్‌గా సీఎస్‌కే ప్రారంభ సంవత్సరాల్లో జట్టు విజయాలకు తన వంతు సహకారం అందించారు. 2013 ఐపీఎల్ సీజన్‌లో 733 పరుగులు సాధించి అద్భుతంగా రాణించారు.

# ఖాతాలో అరుదైన చెత్త రికార్డు..!



వెస్టిండీస్‌తో రాంచీలోని జేఎస్‌సీఏ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో భారత జట్టుకు ఘోర పరాజయం ఎదురైంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 249 పరుగుల భారీ స్కోరు సాధించింది. అయితే, భారత బౌలర్లు, ఫీల్డర్లు ప్రత్యర్థిని కట్టడి చేయడంలో విఫలమయ్యారు. దీంతో వెస్టిండీస్ 18.3 ఓవర్లలోనే 252 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. ఈ ఓటమితో భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ పేరిట ఓ అనవసరపు రికార్డు నమోదయ్యింది.

**అరుదైన చెత్త రికార్డు**

టీ20 క్రికెట్ చరిత్రలో కెప్టెన్‌గా వ్యవహరిస్తూ 240కి పైగా పరుగులు చేసినప్పటికీ.. మూడు సందర్భాల్లో జట్టును ఓటమి నుంచి కాపాడలేకపోయిన తొలి కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ నిలిచినట్లు నివేదిక పేర్కొంది. ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ కెప్టెన్‌గా 2024లో 261 పరుగుల లక్ష్యాన్ని కాపాడుకోవడంలో విఫలమయ్యారు. 2025లో పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా ఉన్నప్పుడు 245 పరుగుల లక్ష్యాన్ని కూడా ప్రత్యర్థి ఛేదించింది. ఇప్పుడు భారత జట్టు 249 పరుగులు చేసినా ఓడిపోవడంతో ఈ జాబితాలో మరోసారి అయ్యర్ పేరు చేరింది.

**టీమిండియా ఖాతాలోనూ**

రాంచీలో ఎదురైన ఓటమి భారత టీ20 అంతర్జాతీయ క్రికెట్ గణాంకాల్లోనూ ప్రత్యేకంగా నిలిచింది. టీ20 చరిత్రలో తొలిసారిగా 225కి పైగా పరుగులు చేసిన తర్వాత భారత్ ఓటమి చెందింది. అంతేకాకుండా.. స్వదేశంలో జరిగిన టీ20 మ్యాచ్‌లో భారత జట్టు తొలిసారిగా 250కి పైగా పరుగులు సంపర్పించుకుంది. భారీ స్కోరు సాధించినప్పటికీ బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో వైఫల్యం జట్టు విజయావకాశాలను దెబ్బతీసింది.

**అయ్యర్ కెప్టెన్సీలో ప్రతికూల రికార్డులు?**

శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో భారత టీ20 జట్టు ప్రదర్శనకు సంబంధించి పలు ప్రతికూల గణాంకాలను ఈ కథనం ప్రస్తావించింది. ఐర్లాండ్‌పై అంతర్జాతీయ మ్యాచ్, సిరీస్‌లో తొలిసారి ఓటమి ఎదుర్కోవడం, వరుసగా ఐదు, ఆరు, ఏడు టీ20ఐ మ్యాచ్‌ల్లో విజయం సాధించలేకపోవడం వంటి అంశాలను పేర్కొంది.వీటితోపాటు టీ20ఐల్లో తొలిసారిగా 100కు పైగా పరుగుల తేడాతో ఓడిపోవడం, 125 పరుగుల భారీ తేడాతో పరాజయం పాలవడం, 76 పరుగులకే ఆలౌట్ కావడం వంటి ప్రతికూల ఫలితాలు నమోదైనట్లు కథనం తెలిపింది. 1,605 రోజుల పాటు కొనసాగిన టీ20ఐ నంబర్ 1 ర్యాంకును కోల్పోవడం, ఇంగ్లండ్‌తో 12 ఏళ్ల తర్వాత టీ20 సిరీస్ ఓడిపోవడం, ఏడేళ్ల తర్వాత వరుసగా రెండు టీ20 సిరీస్‌లను కోల్పోవడం వంటి పరిణామాలను కూడా ప్రస్తావించింది.భారత జట్టు గత ప్రదర్శనతో పోలిస్తే.. ఇటీవలి ఫలితాల్లో గణనీయమైన మార్పు కనిపిస్తున్నట్లు కథనం పేర్కొంది. 2024 జనవరి నుంచి 2026 మే మధ్య భారత్ 61 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి కేవలం ఏడు మ్యాచ్‌ల్లోనే ఓడిపోయింది. అయితే.. ఆ తర్వాతి నాలుగు నెలల్లోనే 18 మ్యాచ్‌లు ఆడి 7 పరాజయాలను ఎదురుకుంది.



# భారత్-శ్రీలంక సిరీస్‌లో కీలక మార్పు..

శ్రీలంక క్రికెట్ జట్టు డిసెంబర్‌లో భారత్‌లో పర్యటించనుంది. ఈ పర్యటనలో ఇరు జట్ల మధ్య మూడు వన్డేలు, మూడు టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. అయితే, ఈ సిరీస్‌కు సంబంధించి బీసీసీఐ కీలక మార్పు చేయనున్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 13న ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరగాల్సిన తొలి వన్డేను అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియానికి మార్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ మార్పుపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో భారీ స్థాయిలో ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇందులో భాగంగా పిచ్, అవుట్‌ఫీల్డ్‌ను పునరుద్ధరించడంతో పాటు అత్యాధునిక సబ్-ఎయిర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. స్టేడియం మౌలిక సదుపాయాలను కూడా అప్‌గ్రేడ్ చేయనున్నారు. ఈ పనుల కారణంగా కొంతకాలం పాటు అక్కడ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించడం సాధ్యం కాకపోవచ్చని సమాచారం.ఈ ఆధునికీకరణ ప్రభావం అంతర్జాతీయ మ్యాచ్‌లతో పాటు దేశవాళీ క్రికెట్‌పైనా పడనుంది. ఢిల్లీ రంజీ జట్టు గుజరాత్, సర్వీసెస్, మహారాష్ట్ర జట్లతో ఆడాల్సిన కొన్ని హోమ్ మ్యాచ్‌లను అరుణ్ జైట్లీ స్టేడియంలో నిర్వహించలేని పరిస్థితి ఏర్పడవచ్చు. మహిళల క్రికెట్, జూనియర్ స్థాయి టోర్నమెంట్లపైనా ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో దేశవాళీ మ్యాచ్‌ల నిర్వహణ కోసం డీడీసీఏ పాలమ్, జామియా మిలియా క్రికెట్ మైదానాలను ప్రత్యామ్నాయ వేదికలుగా పరిశీలిస్తున్నట్లు సమాచారం.

**భారత్-శ్రీలంక వన్డే సిరీస్ షెడ్యూల్**

డిసెంబర్ 13: తొలి వన్డే -- అహ్మదాబాద్
డిసెంబర్ 16: రెండో వన్డే -- చెన్నై
డిసెంబర్ 19: మూడో వన్డే -- అహ్మదాబాద్

**భారత్-శ్రీలంక టీ20 సిరీస్ షెడ్యూల్**

డిసెంబర్ 22: తొలి టీ20 -- రాజ్‌కోట్
డిసెంబర్ 25: రెండో టీ20 -- కటక్
డిసెంబర్ 27: మూడో టీ20 -- పుణె.

# బిజినెస్




## డిజిటల్ సెక్యూరిటీకి రెడ్ అలర్ట్

ప్రపంచవ్యాప్తంగా సైబర్ దాడుల తీవ్రత ఊహించని రీతిలో పెరుగుతోంది. నిక్కీ ఆసియా నివేదిక ప్రకారం, కేవలం ఈ ఏడాది సెప్టెంబర్ నెలలోనే ప్రపంచవ్యాప్తంగా కనీసం 32 కోట్ల మంది ప్రజల వ్యక్తిగత సమాచారం హ్యాకర్ల చేతుల్లోకి వెళ్ళిపోయింది. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు కంపెనీ సిస్టమ్‌లను నిలిపివేయడం లేదా బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు డిమాండ్ చేయడం కంటే, విలువైన డేటాను దొంగిలించడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. నివేదిక ప్రకారం యూఎస్ గుర్తింపు సంస్థ ఐడీస్కాన్ నుంచి 15.3 కోట్ల డ్రైవింగ్ లైసెన్సుల డిజిటల్ డేటా, డోడో బ్రాండ్స్ నుంచి 6.8 కోట్ల మంది కస్టమర్ల సమాచారం లీక్ అయ్యాయి. అలాగే జపాన్‌లో 20 కంపెనీలపై జరిగిన దాడుల్లో 5.7 కోట్ల మంది డేటా చోరీకి గురైంది. 63 శాతం చొరబాట్లలో డేటా దొంగతనమే ప్రధానంగా జరిగినట్లు మైక్రోసాఫ్ట్ నివేదిక కూడా ధృవీకరించింది.చెక్ పాయింట్ రీసెర్చ్ సంస్థ గణాంకాల ప్రకారం, సెప్టెంబర్‌లో ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంస్థపై వారానికి సగటున 2,803 సైబర్ దాడులు జరిగాయి. ఇది గతేడాదితో పోలిస్తే ఏకంగా 48 శాతం ఎక్కువ కావడం గమనార్హం. ఇందులోనూ విద్యా సంస్థలు (వారానికి 6,656 దాడులు), టెలికామ్, ప్రభుత్వ రంగాలు హ్యాకర్ల ప్రధాన లక్ష్యంగా మారాయి. అంతేకాకుండా, ర్యాన్సమ్‌వేర్ దాడులు 53 శాతం పెరగ్గా, ప్రతి 91 ఈ-మెయిళ్లలో ఒకటి మోసపూరిత ఫిషింగ్ మెయిల్‌గా ఉంది. అధునాతన సైబర్ రిస్కుల బారిన ఎక్కువగా పడుతున్న ఐదు ఆసియా-పసిఫిక్ దేశాలలో భారత్ కూడా ఒకటిగా నిలవడం దేశీయ డిజిటల్ భద్రత పట్ల తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.హ్యాకింగ్ దాడులను మరింత వేగంగా, పసిగట్టడానికి వీలులేని విధంగా చేయడానికి సైబర్ నేరగాళ్లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాధనాలను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. హ్యాకర్లు ఏఐ సాంకేతికతను సాంప్రదాయ పద్ధతులతో కలిపి ముప్పు తలపెడుతుండటం వల్ల, అంతర్జాతీయంగా సంస్థలు తమ డిజిటల్ డిఫెన్స్ వ్యవస్థలను అత్యంత కఠినంగా బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఏర్పడిందని నివేదిక పేర్కొంది.

## దూసుకుపోతున్న గోల్డ్, సిల్వర్..




ఈ వారం ప్రారంభం నుంచి బులియన్ మార్కెట్లలో ట్రెండ్ మారుతోంది. మట్నదట్లో రేట్లు తగ్గుతూపోగా వారాంతం నాటికి భారీగా పుంజుకున్నాయి. ప్రధానంగా అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో వస్తున్న కీలక మార్పులకు తోడు ద్రవ్యోల్బణం పెరగటం కూడా రేట్ల పెంపుకూ కీలకంగా మారింది. ఈ క్రమంలో వీకెండ్ షాపింగ్ చేయాలని ప్లాన్ చేస్తున్నవారు ముందుగా తమ నగరాల్లోని రిటైల్ రేట్లలో వచ్చిన మార్పులను పరిశీలించటం బెటర్. అక్టోబర్ 10న బంగారం రేట్లు మళ్లీ పెరిగాయి. దేశవ్యాప్తంగా 24 క్యారెట్ల బంగారం రేటు గ్రాముకు రూ.71 పెరిగింది. దీంతో హైదరాబాద్, వరంగల్, నిజాంబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడప నగరాల్లో స్వచ్ఛమైన బంగారం రేటు రూ.15వేల 142గా కొనసాగుతోంది. ఈ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం రేటు గ్రాముకు రూ.13వేల 880గా కొనసాగుతోంది. శనివారం రోజున వెండి రేట్ల విషయానికి వస్తే.. అక్టోబర్ 10, 2026న దేశవ్యాప్తంగా రూ.5వేలు పెరిగింది కేజీకి. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, వరంగల్, నిజాంబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడపలో కూడా స్వచ్ఛమైన వెండి కేజీ రూ.2లక్షల 45వేలుగా కొనసాగుతోంది. అంటే గ్రాము దాదాపు రూ.245 దగ్గర ఉంది.

## గ్యాస్ సిలిండర్ ధరలు



గత కొన్ని నెలల కిందటే గ్యాస్ సిలిండర్ ధరలు పెరిగి వినియోగదారులకు షాక్ ఇచ్చాయి. మళ్లీ రీసెంట్ గా అక్టోబర్ 1 వ తారీకున వాణిజ్య ఎల్‌పీసీ సిలిండర్ వినియోగదారులకు గట్టి షాక్ తగిలింది. 19 కేజీల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర భారీగా పెరిగింది. దీంతో రెస్టారెంట్లు, హోటళ్లకు మరింత భారం పడనుంది. అలాగే 19 కేజీల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర 62. 50 రూపాయలు పెంచి జనాలను మరింత నిరాశకు గురయ్యేలా చేసింది. కానీ గృహ వినియోగదాలకు ఎలాంటి నష్టం లేదు. 14. 2 కేజీల డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు చేయలేదు. ప్రస్తుతం రూ. 994 గా నడుస్తుంది. మరీ పెంచిన ధరలు ఎలా ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం..

హైదరాబాద్: రూ. 3,065
విజయవాడ: రూ. 2, 932. 50
విశాఖపట్నం: రూ. 2, 827.50
ముంబై: రూ. 2, 764
చైన్నై : రూ. 2, 983
ఢిల్లీ : రూ. 2, 837
పట్నా : రూ. 3, 100

## బ్యాంకులకు డబ్బు కష్టాలు..!




రిజర్వ్ బ్యాంక్ దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థలో లిక్విడిటీని మరింత కట్టుదిట్టం చేసేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాంకులు రోజువారీగా నిర్వహించాల్సిన క్యాష్ రిజర్వ్ రేషియో(సీఆర్‌ఆర్) కనీస నిల్వ నిబంధనను 90 శాతం నుంచి 99 శాతానికి పెంచింది రిజర్వు బ్యాంక్. ఈ కొత్త నిబంధన అక్టోబర్ 16 నుంచి అమల్లోకి రానుంది.గతంలో ఉన్న నిబంధనల ప్రకారం.. బ్యాంకులు 15 రోజుల రిపోర్టింగ్ కాలంలో సగటున నిర్దేశిత సీఆర్‌ఆర్ ను కాపాడుకుంటూనే.. ఒక్కో రోజు మాత్రం కనీసం 90 శాతం డబ్బు నిల్వలు ఉండేలా చూసుకునే వెసులుబాటు ఉండేది. ఉదాహరణకు.. ఒక వారంలో తక్కువ నిల్వలు ఉంచినా, మరో వారంలో ఎక్కువ నిల్వలు ఉంచడం ద్వారా సగటును సరిచేసుకునేవారు. కానీ తాజా సవరణతో ఈ రోజువారీ వెసులుబాటు కేవలం 1 శాతానికి పరిమితమైంది. అంటే 99 శాతం మెయింటైన్ చేయాలి క్యాష్. దీనివల్ల బ్యాంకులు తమ రోజువారీ లిక్విడిటీ నిర్వహణలో మరింత అప్రమత్తంగా ఉండాల్సి వస్తుంది.ఈ నిర్ణయం వెనుక ప్రధాన కారణం బ్యాంకింగ్ వ్యవస్థలో ఉన్న అదనపు లిక్విడిటీ అంటే అందుబాటులో ఉన్న డబ్బును అదుపులో ఉంచడమే. అగస్టు, సెప్టెంబర్ నెలల్లో విదేశీ మూలధన ప్రవాహాల కారణంగా బ్యాంకింగ్ వ్యవస్థలో సర్ప్లస్ లిక్విడిటీ భారీగా పెరిగింది. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అక్టోబర్ 7న జరిగిన ద్రవ్య విధాన సమీక్షలో మాట్లాడుతూ.. రాబోయే ఆర్థిక సంవత్సరంలో సహజసిద్ధమైన కారకాల ద్వారా ఈ మిగులు లిక్విడిటీ లభ్యత క్రమంగా తగ్గుతుందని తెలిపారు.అయితే ఆర్‌బీఐ ఈ నిర్ణయం ద్వారా మొత్తం సీఆర్‌ఆర్ శాతాన్ని పెంచలేదని, కేవలం రోజువారీ నిర్వహణ నిబంధనలను మాత్రమే కఠినతరం చేసిందని ఆర్థిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ చీఫ్ ఎకానమిస్ట్ గౌర సేన్‌గుప్తా మాట్లాడుతూ.. ఈ చర్య ద్వారా రోజువారీగా లిక్విడిటీ వ్యవస్థను నియంత్రించడానికి వీలవుతుందని, అయితే దీనివల్ల పెద్దఎత్తున ద్రవ్య లభ్యతకు ఎలాంటి ఇబ్బంది కలగదని అభిప్రాయపడ్డారు.ప్రస్తుతం లిక్విడిటీ అడ్జస్ట్‌మెంట్ ఫెసిలిటీ కింద నికర మిగులు సగటున రూ. 5లక్షల 90వేల కోట్లుగా ఉండగా.. తాజా డేటా ప్రకారం ఇది రూ. 3లక్షల 92 వేల కోట్లకు చేరింది. ద్రవ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ వేరియబుల్ రేట్ రివర్స్ రెపో ఆక్షన్‌లు, ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్ వంటి తగిన సాధనాలను భవిష్యత్తులోనూ ఉపయోగించనున్నట్లు ఆర్‌బీఐ స్పష్టం చేసింది.




# ట్రోలర్స్‌పై తాప్సీ ఫైర్!

సినిమా రంగంలో ఉంటూ నిత్యం విమర్శలను, ట్రోలింగ్‌ను ఎదుర్కోవడం అస్సలు సులువు కాదని తాప్సీ ఆవేదన వ్యక్తం చేశారు. నటుల స్థానం ఎదుటివారి అభిప్రాయాలపైనే ఆధారపడి ఉంటుందని, జనాలు సరదాగా చేసే రెండు సెకన్ల కామెంట్లు కూడా నటుల మానసిక ఆరోగ్యాన్ని దారుణంగా దెబ్బతీస్తాయని.. ఒక్కోసారి ప్రాణాల మీదకి కూడా వస్తుందని చెప్పారు. సోషల్ మీడియాలో అందరినీ సంతోషపెట్టాలనే అసాధ్యమైన ప్రయత్నం చేసి తాను చాలా ప్రశాంతతను కోల్పోయానని, ట్రోలర్లను మెప్పించడానికి ఎంతో విలువైన సమయాన్ని వృథా చేసుకున్నానని వాపోయారు.కరోనా లాక్‌డౌన్ సమయంలో ఎక్కడికీ వెళ్లే అవకాశం లేకపోవడంతో తన మనసుతో తానే గడపాల్సి వచ్చిందని తాప్సీ గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలోనే తనలోని లోపాలను, భయాలను అర్థం చేసుకుని ప్రొఫెషనల్ థెరపీ తీసుకున్నట్లు వెల్లడించారు. సోషల్ మీడియాలో నిత్యం విమర్శలు ఎదుర్కొంటూ మానసికంగా కుమిలిపోవడం కంటే, అక్కడి నుంచి దూరంగా ఉండటమే మేలని భావించి తాను అప్పట్లో సోషల్ మీడియాకు దూరమయ్యానని స్పష్టం చేశారు. తెరపై ఎంత గ్లామరస్‌గా కనిపించినా నటులు కూడా సాధారణ మనుషులేనని, వారి వెనుక కూడా భావోద్వేగాలు ఉంటాయని ప్రతి ఒక్కరూ గుర్తించాలని తాప్సీ కోరారు. ప్రస్తుతం ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.




# టికెట్ ధరల పెంపు.. గ్రీన్ సిగ్నల్

సూపర్‌స్టార్ రజినీకాంత్ కథానాయకుడిగా తెరకెక్కిన ప్రతిష్ఠాత్మక చిత్రం 'జైలర్-2' విడుదల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సినీ అభిమానులకు బిగ్ అప్‌డేట్ ఇచ్చింది. ఈ సినిమా ప్రదర్శనకు సంబంధించి థియేటర్లలో టికెట్ ధరల పెంపునకు ఏపీ ప్రభుత్వం అధికారికంగా అనుమతి మంజూరు చేసింది. భారీ అంచనాలతో వస్తున్న ఈ సీక్వెల్ నిర్మాతలు సమర్పించిన విజ్ఞప్తిని పరిశీలించిన అనంతరం, ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ధరల పెంపు వర్తించే సమయాన్ని కూడా ప్రభుత్వం స్పష్టంగా ఖరారు చేసింది. చిత్రం విడుదలయ్యే ఈ నెల 15వ తేదీ నుంచి 21వ తేదీ వరకు, అంటే సరిగ్గా వారం రోజుల పాటు మాత్రమే పెంచిన ధరలు అమలులో ఉంటాయి. ఆ తర్వాత వారం నుంచి సాధారణ టికెట్ ధరలే పునరుద్ధరించబడతాయని అధికారులు స్పష్టం చేశారు. చిత్రానికి ఉన్న విపరీతమైన క్రేజ్, నిర్మాణంపై జరిగిన భారీ వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని మొదటి వారం కేటాయింపులకు ఈ ప్రత్యేక సడలింపు ఇచ్చారు. పెంచిన వివరాలను పరిశీలిస్తే, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ప్రతి టికెట్‌పై రూ. 50 మేర, అలాగే మల్టీప్లెక్సుల్లో రూ. 75 వరకు పెంచుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయితే, ఈ పెంచిన టికెట్ ధరలకు అదనంగా నిబంధనల ప్రకారం వర్తించే జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మొదటి వారంలో జైలర్-2 సందడి థియేటర్లలో ఏ స్థాయిలో ఉండబోతోందో ఈ అప్‌డేట్ ద్వారా స్పష్టమవుతోంది.

# మాస్ తుఫాన్ మొదలైంది..




మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ ప్రధాన పాత్రలో, ప్రముఖ దర్శకుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ హై వోల్టేడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ రాబోతున్న విషయం తెలిసిందే. ' NTR 31' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్‌ను ఫైనల్ చేశారు మేకర్స్. మైత్రి మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్, టీ-సిరీస్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీలో రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. అనిల్ కపూర్, బిజు మీనన్, అశుతోష్ రాణా తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నిజానికి ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సమ్మర్ స్పెషల్‌గా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు ప్లాన్ చేశారు మేకర్స్. కానీ ఇటీవల ఎన్టీఆర్ చేతికి గాయం కావడంతో షూటింగ్‌కు బ్రేక్ పడింది. దీంతో సినిమా అనుకున్న టైమ్‌కు రిలీజ్ కాదని అంతా భావించారు. ఇలాంటి టైమ్‌లో షూటింగ్ అప్డేట్ ఇచ్చాడు నటుడు బిజు మీనన్. తాజాగా ఓ ఈవెంట్‌లో పాల్గొన్న ఈయన డ్రాగన్ షూటింగ్ అప్డేట్ ఇస్తూ.. 'NTR గారికి గాయం అవ్వడం వల్ల షూట్ కొంతకాలం ఆగింది. ఇప్పుడు తిరిగి ప్రారంభమైంది' అంటూ చెప్పుకొచ్చాడు. ప్రజెంట్ నటుడు బిజు మీనన్ చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతుండగా.. 'మాస్ తుఫాన్ మొదలైంది' అంటూ కామెంట్స్ చేస్తున్నారు ఎన్టీఆర్ ఫ్యాన్స్.

# ఆ సినిమా విడుదల వాయిదా!




విష్ణు విశాల్, మమితా బైజు జంటగా నటిస్తున్న లేటెస్ట్ లవ్ ఎంటర్‌టైనర్ 'ఇరందు వానం'. రామ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 23న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నట్లు ఇప్పటికే టీమ్ అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇచ్చిన విషయం తెలిసిందే. కానీ తాజా సమాచారం మేరకు ఈ సినిమా వాయిదా పడబోతున్నట్లు తెలుస్తోంది. అందుతున్న సమాచారం మేరకు ఇరందు వానం సినిమా విడుదల డిసెంబర్‌కు వాయిదా పడినట్లు టాక్. చిత్ర బృందం చాలా ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నారట. ఎందుకంటే జైలర్-2 అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కాబోతుండగా.. జైలర్ 2 హవా నడుస్తున్న తర్వాతి వారంలో విడుదల చేస్తే తక్కువ థియేటర్లు దక్కే అవకాశం ఉండేదని భావించి ఇలా ప్లాన్ చేస్తున్నారట. అంతేకాకుండా, డిసెంబర్‌లో కోలీవుడ్ నుండి పెద్ద సినిమాలేవీ విడుదలకు లేకపోవడంతో ఈ సినిమాకు లైన్ కూడా క్లియర్‌గా ఉంబోతున్నట్లు తెలుస్తోంది. అయితే.. ఈ వైరల్ వార్తల్లో ఎంతవరకు నిజం ఉందో తెలియాలంటే వాయిదాపై అఫీషియల్ అప్డేట్ రావాల్సి ఉంది.




# రవితేజ 'RT78' పై సాలిడ్ అప్డేట్ ఇచ్చిన టీమ్

రీసెంట్ బ్లాక్ బస్టర్ హిట్ 'ఇరుముడి' తర్వాత మాస్ మహా రాజా రవితేజ తన తదుపరి చిత్రంపై ఫోకస్ పెట్టాడు. ఈ మేరకు దర్శకుడు వివేక్ ఆత్రే-యతో చేతులు కలిపినట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే వీరిద్దరి మధ్య చర్చలు కూడా జరగగా.. ఇందుకు సంబంధించిన ఫొటోలు సైతం నెట్టింట సందడి చేశాయి. అయితే.. ఎట్టకేలకు ఈ మూవీపై అఫీషియల్ అప్డేట్ వచ్చింది. ఈ సినిమా టైటిల్ రివీల్‌కు డేట్ ఫిక్స్ చేస్తూ... 'అప్రమత్తంగా ఉండండి!! మాస్ మహారాజా రవితేజ #RT78 చిత్రానికి వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్నాడు. టైటిల్ డాక్యుమెంటరీ అక్టోబర్ 11న ఉదయం 10:30 గంటలకు' అంటూ ఓ క్రేజీ పోస్టర్‌ను షేర్ చేశారు. వివేక్ ఆత్రేయ మార్క్ కామెడీ, ఎంటర్‌టైన్‌మెంట్ అండ్ రవితేజ మాస్ ఇమేజ్ కలగలిపి రాబోతున్న ఈ సినిమాకు మేకర్స్ 'తులాభారం' అనే టైటిల్‌ను అనుకుంటున్నట్లు వార్తలు వస్తుండగా.. మరో కొన్ని గంటల్లో దీనిపై అఫీషియల్ క్లారిటీ రానుంది.

# మృణాల్ ఎమోషనల్ కామెంట్స్

నాలుగేళ్ల నిరీక్షణపై మాట్లాడుతూ.. ప్రతిదీ జరగాల్సిన సమయమే జరుగుతుందని, ఈ సినిమా తన మొదటి బిడ్డలాంటిదని మృణాల్ ఎమోషనల్ అయ్యారు. షూటింగ్ పూర్తయి ఇన్ని రోజులు గడిచినా, ఆనాటి జ్ఞాపకాలు తన మదిలో అలాగే ఉన్నాయని ఆమె తెలిపారు.మధ్యలో తాను రెండు ఫోన్లు మార్చినా, పాత ఫోన్‌లో ఉన్న ఆనాటి మెమొరీస్, షూటింగ్ టైమ్‌లో పాటించిన స్ట్రిక్ట్ డైట్ అన్నీ ఇప్పటికీ స్పష్టంగా గుర్తుకొస్తాయని చెప్పారు. ఈ సినిమా కేవలం వినోదం పంచేది మాత్రమే కాకుండా, సమాజంలో ఎప్పటికీ చర్చించాల్సిన ఒక అత్యంత సున్నితమైన అంశంపై తెరకెక్కిందని అన్నారు. ఈ మూవీ చూసిన తర్వాత చాలా మంది యువకులు తమకు ఫోన్ చేసి, అమ్మాయిలు వద్దు అంటే అది నిజంగా వద్దు అనే అర్థ-మేనని తాము తెలుసుకున్నామని చెప్పడం తనకు ఎంతో తృప్తినిచ్చిందని మృణాల్ తెలిపారు. మహిళలపై సమాజంలో నిరంతరం జరిగే తీర్పుల గురించి మాట్లాడుతూ మృణాల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు."ప్రస్తుతంలో మన గురించి మాట్లాడటానికి ఏమీ లేనప్పుడు, కొంతమంది కావాలనే మన గతాన్ని తవ్వుతుంటారు. నా విషయంలోనూ సరిగ్గా అదే జరుగుతోంది" అంటూ తనపై వస్తున్న ఊహాగానాల గురించి పరోక్షంగా స్పందించారు.







# అదృష్టవంతురాలిగా భావిస్తున్నా

బిగ్ బాస్ కన్నడ విన్నర్ కార్తీక్ మహేష్, హెబ్బా పటేల్, అనూష రాయ్, శరణ్, కోమల్ కుమార్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. ఇందులో అదా శర్మ సాక్షాత్తు దేవి పాత్రలో నటిస్తుండటం విశేషం.భారీ ప్రాజెక్ట్‌లో భాగం కావడంపై అదా శర్మ సోషల్ మీడియా వేదికగా ఓ ఎమోషనల్ పోస్ట్ పంచుకున్నారు. జాతీయ అవార్డు గ్రహీత, దర్శకులు బి.ఎం. గిరిరాజ్ గారితో కలిసి పనిచేసే అవకాశం లభించడం తన అదృష్టమని ఆమె పేర్కొన్నారు. ఈ దైవిక పాత్ర కోసం తనను ఎంపిక చేసుకున్నందుకు నిర్మాత గురు దేశ్‌పాండే, వారి బృందానికి ఆమె ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. వివిధ భాషల్లో విభిన్నమైన, సవాల్‌తో కూడిన పాత్రలు పోషించే అవకాశం లభిస్తున్నందుకు తాను చాలా సంతోషంగా, అదృష్టవంతురాలిగా భావిస్తున్నానని అదా శర్మ తన ఆనందాన్ని పంచుకున్నారు. భారీ అంచనాల మధ్య రూపొందిన ఈ చిత్రం డిసెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# మూవీపై పెరిగిన అంచనాలు

యంగ్ అండ్ ఎనర్జిటిక్ హీరో సందీప్ కిషన్ ఇటీవల 'సిగ్మా', 'సూపర్ సుబ్బు' వంటి సినిమాలతో ప్రేక్షకులను అలరించారు. ఇక ఇప్పుడు ఆయన ప్రధాన పాత్రలో 'కరికాల' అనే భారీ ఫాంటసీ అడ్వెంచర్ మూవీ తెరకెక్కుతోంది. 'శంబాల' సినిమాతో హ్యాట్రిక్ హిట్ కొట్టిన డైరెక్టర్ యుగంధర్ ముని ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై సోషియో ఫాంటసీ డ్రామాగా వస్తున్న ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో రెండు భాగాలుగా విడుదల చేయనున్నారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో 'కరికాల: చాప్టర్ 1'ను 2027 జూలై 2న, అలాగే 'కరికాల: చాప్టర్ 2'ను 2027 అక్టోబర్ 28న థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే ప్రకటించింది.ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ బిగ్ ప్రాజెక్ట్‌లోకి తాజాగా ఓ హాట్ బ్యూటీ ఎంట్రీ ఇచ్చింది. ఈ చిత్రంలో గ్లామరస్ నటి కేథరిన్ నటిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. 'కరికాల అద్భుత ప్రపంచంలోకి కేథరిన్ థ్రెసాకు స్వాగతం.. ఒక కొత్త సౌందర్యం, రహస్యం.. అద్భుతమైన అధ్యాయం" అంటూ మేకర్స్ ఓ క్రేజీ పోస్టర్‌ను షేర్ చేసి సినిమాపై భారీ హైప్ క్రియేట్ చేశారు. ఇక ఈ సోషియో ఫాంటసీ మూవీలో కేథరిన్ ఒక ప్రత్యేకమైన గ్లామరస్ స్పెషల్ సాంగ్ చేయబోతున్నట్లు టాక్. కేథరిన్ ఎంట్రీతో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.




Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**